




బుక్కపట్నం చెరువులో జలహారతి ఇస్తున్న చంద్రబాబు (ఫైల్)

నాడు జలహారతి.. నేడు జలగండం

చెరువులు నింపి జలహారతి..

టీడీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హంద్రీనీవా పథకానికి నిధులిచ్చి కాలువ, రిజర్వాయర్ పనులను పరుగులు పెట్టించారు. నాలుగేళ్లలోనే సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేశారు. ఇందులో భాగంగా 2018 జనవరి 12న ధర్మవరం చెరువుకు నీరిచ్చి, జలహారతి కార్యక్రమం చేపట్టారు. జిల్లాలోనే అతిపెద్ద బుక్కపట్నం చెరువుకు 2018 జనవరి 11న చంద్రబాబునాయుడు జలహారతి నిర్వహించి, పైలాన్‌ను ఆవిష్కరించారు. చంద్రబాబు చొరవతో ఆ రెండు చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఫలితంగా నేటికీ ఆయకట్టు రైతులకు సాగు నీరు లభిస్తోంది. మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో వందలాది చెరువులకు సాగునీరు ఇచ్చారు. ఫలితంగా వేలాది బీడు భూములు సాగులోకి వచ్చాయి. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కుప్పం కాలువ పనులు వేగంగా చేపట్టి అనుసంధానంగా వందలాది చెరువులను నింపారు.

వైసీపీ పాలనలో ఒక్కటీ చేపట్టని దుస్థితి
చెరువులు, రిజర్వాయర్లు నింపని ప్రభుత్వం
జిల్లా వాసులకు తప్పని నీటి తిప్పలు



నాడు హంద్రీనీవా నీటి గలగలలు (ఫైల్)



జిల్లాలో నీరులేక ఎండిపోయిన చెరువు

ఉమ్మడి అనంత అంటే దేశంలోనే అతితక్కువ వర్షపాతం నమోదయ్యే జిల్లాల్లో ఒకటి. వర్షాలు రాక చెరువులన్నీ వట్టిపోయి కనిపించేవి. ఆయకట్టు బీడుగా దర్శనమిచ్చేది. జనం తాగు, రైతులు సాగునీటి కోసం తిప్పలు పడేవారు. గత టీడీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలో నీటి ప్రాజెక్టులను పరుగులు పెట్టించారు. ఎన్టీఆర్ మానస పుత్రిక హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా జిల్లాలోని వందలాది చెరువులను కృష్ణాజలాలతో నింపడానికి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారు. కాలువ గట్లపై నిద్రించి, ఉమ్మడి జిల్లాలోని చెరువులన్నింటినీ నింపి, రైతుల కళ్లలో ఆనందం నింపారు. ఉమ్మడి జిల్లా అనంతను పారిశ్రామిక, వ్యవసాయ, ఉద్యానహబ్‌గా మార్చే దిశగా టీడీపీ హయాంలో అడుగులు పడ్డాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకంతోపాటు చిన్న, మధ్యతరహా, భారీ సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించింది. పనులు ముందుకు సాగలేదు. ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. కొత్తగా ఒక్క సాగునీటి ప్రాజెక్టును చేపట్టింది లేదు. టీడీపీ హయాంలో చేపట్టిన పనులకు కూడా కొర్రీలు వేశారు. అరచేతిలో హామీలను చూపిస్తూ ఐదేళ్లు వెల్లదీశారు. అంతులేని నిర్లక్ష్యంతో జిల్లాకు జలగండం తెచ్చారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

మరుగున పడేశారు..

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద రూ.591.57 కోట్లతో జీడిపల్లి జలాశయం నుంచి ఎగువ పెన్నార్ ప్రాజెక్టుకు ఎత్తిపోతల నీరిచ్చేలా పథకానికి రూపకల్పన చేశారు. ఇందులో పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి జలాశయాల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. 2018 ఆగస్టు ఒకటిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనులు ప్రారంభించారు. 11.15 శాతం కాలువ నిర్మాణ పనులు సైతం చేపట్టారు. చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు తాగు, సాగు నీరివ్వాలన్న సంకల్పంతో మడకశిర ఉపకాలువ కింద దేమకేతేపల్లి నుంచి 160 చెరువులకు నీరిచ్చేలా రూ.510 కోట్లతో ఎత్తిపోతల పథకానికి డీపీఆర్‌ను టీడీపీ హయాంలోనే సిద్ధం చేసి, సాంకేతిక అనుమతులకు పంపారు. మడకశిర నియోజక వర్గంలోని రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్ల నిర్మాణాలు ప్రతిపాదనల దశలోనే ఆగిపోయాయి. నియోజకవర్గంలో శాశ్వతంగా తాగు, సాగు నీటి సమస్యను పరిష్కరించ డానికి టీడీపీ హయాంలో రాళ్లపల్లి, రత్నగిరి వద్ద రిజర్వాయర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రాళ్లపల్లి రిజర్వాయర్‌కు డీపీఆర్ తయారీకి రూ.27 లక్షల నిధులు కూడా మంజూరు చేసింది. రత్నగిరి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి సర్వే చేసి, డీపీఆర్ తయారీకి రూ.కోటితో ప్రతిపాదనలు పంపారు.

టీడీపీ హయాంలో నీటి ప్రాజెక్టులు పరుగులు

నెర్రెలుబారిన చెరువులకు నీరు

తీవ్ర వర్షాభావంతో దశాబ్దాలుగా నెర్రెలు బారిన చెరువులు, ఆయకట్టు సాగులేక బీడు భూములే దర్శనమిచ్చేవి. సాగుపై జిల్లా రైతులు ఆశలు వదులుకునే పరిస్థితులు తలెత్తాయి. గత టీడీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉమ్మడి అనంత జిల్లాపై ప్రత్యేక చొరవ చూపారు. హంద్రీనీవా ద్వారా జిల్లాకు కృష్ణాజలాలను తీసుకొచ్చారు. చెరువులు, కుంటలను నింపారు. దీంతో ఏళ్లగా బీడుగా ఉన్న ఆయకట్టు సాగులోకి వచ్చి, రైతన్నల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జీడిపల్లి-పుంగనూరు ప్రధాన కాలువతోపాటు మడకశిర ఉపకాలువ కింద వందలాది చెరువులను నింపారు. దీంతో ఏడాది పొడవునా చెరువుల్లో జలసవ్వడులు వినిపించేవి. దీంతో సాగువైపు రైతన్నలు కదిలారు. చెరువుల కింద ఆయకట్టుతోపాటు బోరుబావుల్లో భూగర్భజలాలు పెరుగుతుండడంతో పంటలు పెట్టారు. వరి, వేరుశనగ, మల్బరీ, మొక్కజొన్నతోపాటు వాణిజ్య పంటలు సాగుచేశారు. మడకశిర ఉపకాలువ పరిధిలోని చెరువుల కింద రెండు దశాబ్దాల తరువాత వరిమళ్లు కనిపించాయి. జీడిపల్లి-పుంగనూరు బ్రాంచ్ కాలువ కింద మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్లతోపాటు రాప్తాడు, పుట్టపర్తి, ధర్మవరం నియోజక వర్గాల్లో వందలాది చెరువులు కష్ణాజలాలతో తొణికిసలాడేవి. రిజర్వాయర్లు, చెరువుల కింద పంటల సాగుతో పల్లెసీమలు పచ్చదనం సంతరించుకుని, కోనసీమ అందాలను తలపించేవి. దీంతో పంటలు లేక ఇతర ప్రాంతాలు వలస వెళ్లిన కూలీలు స్వగ్రామాలకు తిరిగొచ్చారు. ఆయకట్టు భూముల విలువ విపరీతంగా పెరిగింది.

శాశ్వత పరిష్కారం

హిందూపురం, పెనుకొండ, మడకశిర ప్రాంతాల రైతులు వర్షాధారంగానే పంటలు వేసేవారు. ఏడాది పొడవునా తాగునీటి కోసం పానిపట్టు యుద్ధాలు సాగేవి. సమస్య పరిష్కారానికి గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర ఉపకాలువ పనులను ఆమోదించారు. పనులను పరుగులు పెట్టించి 2018 ఏప్రిల్ 15న గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశారు. మడకశిర ఉపకాలువ ద్వారా కృష్ణాజలాలతో లేపాక్షి పెద్ద చెరువును నింపారు. లేపాక్షి ఉత్సవాల సందర్భంగా పైలాన్‌ను ఆవిష్కరించి, పెద్దచెరువులో జలహారతి కార్యక్రమానికి అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మడకశిర ఉపకాలువ ద్వారా పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో వందలాది చెరువులకు సాగు, తాగునీరు ఇచ్చారు. దీంతో బీడుబడిన ఆయకట్టు సాగులోకి వచ్చింది. ప్రజల జీవన విధానంలో పెనుమార్పులు తెచ్చింది.

అంతా రివర్స్

నీటి ప్రాజెక్టులు పరుగులు పెడుతున్న సమయంలో 2019లో ఎన్నికలొచ్చాయి. అందులో వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో నీటి ప్రాజెక్టులు అటకెక్కాయి. ఐదేళ్ల పాలనలో నిధుల మంజూరు ఊసేలేదు. పనులు అడుగు ముందుకు పడలేదు. హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీరిచ్చే జీడిపల్లి-కుప్పం, గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర ఉపకాలువ గట్లు బలహీన పడ్డాయి. ఏటా గండ్లు పడుతూ నీరు ముందుకు కదలడం కష్టంగా మారింది. ఇరువైపులా లైనింగ్ వేయని కారణంగా కాలువలో రాళ్లు తేలాయి. మడకశిర ఉపకాలువ, జీడిపల్లి నుంచి కుప్పం వెళ్లే కాలువల్లో మరమ్మతులు మరిచారు. మళ్లీ ఎన్నికలు వచ్చినా హంద్రీనీవా కాలువ వెడల్పు, మరమ్మతులు, లైనింగ్ పనులకు నిధులివ్వకుండా నిర్వీర్యం చేశారు.



నాడు నిండుగా గొల్లపల్లి రిజర్వాయర్ (ఫైల్)



మూడు రిజర్వాయర్ల నిర్మాణానికి సీఎం జగన్ వెంకటాంపల్లి వద్ద ఆవిష్కరించిన శిలాఫలకం



ఆగిపోయిన జిల్లేడుబండ రిజర్వాయర్ కట్ట నిర్మాణం

ఆటోమొబైల్ కారిడార్‌కు బీజం

హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో భాగంగా పెనుకొండ మండలంలోని గొల్లపల్లి వద్ద జలాశయ నిర్మాణానికి టీడీపీ హయాంలో శ్రీకారం చుట్టారు. రూ.220 కోట్లతో 1.910 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ పనులు చేపట్టారు. పనులను పరుగులు పెట్టించి, 18 నెలల వ్యవధిలోనే పూర్తిచేశారు. 2016 డిసెంబరు 2న ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు గొల్లపల్లి జలాశయాన్ని ప్రారంభించి, మడకశిర ఉపకాలువకు నీరిచ్చారు. కార్ల పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన కియ మోటార్స్‌కు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని కేటాయించారు. రిజర్వాయర్‌లో రూ.22 కోట్లతో ఇన్‌టేక్‌వెల్ తవ్వించి, ప్రత్యేక పైపులైన్ చేసి ద్వారా నీరిచ్చారు. కియ కార్ల పరిశ్రమ ఏర్పాటుకు గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణంతోనే బీజం పడింది. పెనుకొండ, హిందూపురానికి ప్రత్యేక పైపులైన్ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచే నీరు సరఫరా చేస్తున్నారు.

జగన్ తెచ్చిన జలగండం

ప్రభుత్వ నిర్లక్ష్యం, ముందుచూపు కొరవడటంతో హంద్రీనీవా కాలువ కింద జలాశయాలు, చెరువులను నీటితో నింపలేకపోయారు. జలాశయాలు, చెరువుల్లో నీరులేక భూగర్భజల మట్టం తగ్గడంతో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. గతేడాది ఆగస్టు 16న శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేసినా.. నిర్దేశిత టీఎంసీల కంటే సగమే ఎత్తిపోయడంతో జలాశయాలను నింపలేకపోయారు. వెరసి.. రిజర్వాయర్లలో నీటి మట్టం అట్టడుగుకు పడిపోయింది. చెరువుల్లో చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. జీడిపల్లి నుంచి రెండోదశ కింద వచ్చిన నీరంతా పక్క జిల్లాకు తరలించారు. జిల్లాలోని హంద్రీనీవాలో రెండో దశ కాలువ కింద గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్లకు అరకొర నీరిచ్చి, ఎండబెట్టారు. వాటి నుంచి చెరువులకు నీరిచ్చే అవకాశమే లేకుండా పోయింది. టీడీపీ హయాంలో రిజర్వాయర్లు, చెరువులు నీటితో తొణికిసలాడేవి. ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. మడకశిర ఉపకాలువ కింద పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో 265 చెరువులను నింపాల్సి ఉంది. ఈ ఏడాది గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి కాలువకు చుక్క నీరు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో పెనుకొండ, హిందూపురం, మడకశిరలో వందలాది చెరువుల్లో నీరులేక భూగర్భజలాలు అడుగంటి దాహపు కేకలు వినిపిస్తున్నాయి.

నీటి మూటలే..

రాప్తాడు నియోజకవర్గానికి సాగునీరు అందించే జీడిపల్లి-పేరూరు ప్రాజెక్టు పూర్తి చేస్తామని పాదయాత్ర సందర్భంగా జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక సీఎం హోదాలో శంకుస్థాపన చేశారు. నియోజక వర్గంలోని 75 వేల ఎకరాలకు సాగునీరిచ్చి కోనసీమగా మార్చేస్తామని గొప్పగా ప్రకటించారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద రూ.803 కోట్లతో ముట్టాల, తోపుదుర్తి, దేవరకొండ వద్ద మూడు జలాశయాల నిర్మాణానికి 2020 డిసెంబరు 9న సీఎం జగన్ చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి వద్ద శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టుల నిర్మాణానికి 5171 ఎకరాలు అవసరమని అంచనా వేశారు. జీడిపల్లి నుంచి ఎగువ పెన్నా జలాశయం వరకు 53.45 కి.మీ. ప్రధాన కాలువపై నాలుగు ఎత్తిపోతల పథకాలు, 110 కాంక్రీటు కట్టడాలు చేపట్టాలన్నది ప్రణాళిక. కొత్తపల్లి, ఆత్మకూరు, పాలవెంటాపురం, మద్దలచెరువు వద్ద లిఫ్టుల నిర్మాణానికి రూపకల్పన చేశారు. జలాశయాలకు శిలాఫలకం వేసి, మూడేళ్లు దాటింది. మళ్లీ ఎన్నికలే వచ్చాయి కానీ, ప్రాజెక్టులకు భూసేకరణ కూడా చేయలేదు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని జలాశయాల శంకుస్థాపన రోజున ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి గొప్పలు చెప్పారు. రిజర్వాయర్ల నిర్మాణానికి నిధులు సాధించలేకపోయారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. హంద్రీనీవా పథకం కింద ముదిగుబ్బ మండలం గుడ్డంపల్లి తండా వద్ద 23 వేల ఎకరాలను సాగులోకి తెచ్చేందుకు 2.41 టీఎంసీల సామర్థ్యంతో జిల్లేడుబండ ప్రాజెక్టుకు రూ.680 కోట్ల అంచనా వ్యయంతో 2020 సెప్టెంబరు 22న కట్ట నిర్మాణ పనులు ప్రారంభించారు. ఐదేళ్లు దాటినా 10 శాతం పనులు కూడా పూర్తికాలేదు. బిల్లులు అందుక పనులు ఆగిపోయాయి. ఇక 2500 ఎకరాలు ముంపుబారిన పడుతున్నా నిర్వాసితులకు పైసా కూడా పరిహారం అందలేదు. భూములిచ్చిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ పాలకులు ఐదేళ్లు నిద్రమత్తులో ఉండి, తీరా ఎన్నికల ముందు పుట్టపర్తి నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకం పేరుతో డ్రామాకు తెరలేపారు.



ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	41.0 26.0	41.0 25.0	42.0 26.0	39.0 24.0	38.0 26.0

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 26: పదో తరగతిలో(2023-24 విద్యా సంవత్సరం) ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ఇంటర్ ప్రవేశాల కోసం ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన్ మురళి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కులంతో సంబంధం లేకుండా ఆర్డీటీ సెట్‌కు అర్హులని తెలిపారు. ఆర్డీటీలో స్పాన్సర్ నంబర్ ఉన్న విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదివినా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పదో తరగతిలో 500పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఉమ్మడి జిల్లాలో ఉన్న ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీసుల్లో పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం (ఎస్సీ, ఎస్టీ, బీసీ), 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మే 4వతేదీ నుంచి పదో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, మే 19న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 08554-271353, 271354 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జూన్ 1 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



కొత్తచెరువు, ఏప్రిల్ 26: ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా పరీక్షల విభాగాధికారి లాజర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జూన్ 8 వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. జిల్లాలో ఓపెన్ ఇంటర్ పరీక్షలు 1525 మంది రాయగా.. 888 మంది ఉత్తీర్ణులై 58.23 శాతం నమోదైందన్నారు. తద్వారా జిల్లా 15వ స్థానంలో నిలిచిందన్నారు. ఓపెన్ టెన్త్ పరీక్ష 703 మంది రాయగా.. 249 మంది ఉత్తీర్ణులయ్యారనీ, 35.42 శాతం నమోదై రాష్ట్రంలో 19వ స్థానంలో జిల్లా నిలిచిందన్నారు. ఈనెల 29 నుంచి మే 7వ తేదీ వరకు రీవాల్యూషన్, రీవెరిఫికేషన్‌కు అవకాశం కల్పించామన్నారు.

వైసీపీ అమానవీయం..!

వైసీపీ మూకల దాష్టీకానికి పరాకాష్ట ఇది..
టీడీపీ ప్రచారంలో పాల్గొన్నాడని..
మైనార్టీ వర్గానికి చెందిన నిరుపేదపై దాష్టీకం ప్రదరించారు..
నానా దుర్భాషలాడారు..
అద్దె ఇంట్లో నుంచి వెల్లగొట్టారు..
రాత్రి అని కూడా చూడకుండా..
భార్యాబిడ్డతో ఎక్కడికెళ్తాడని ఆలోచించకుండా..
సామగ్రిని రోడ్డున పడేశారు..
ఎటు వెళ్లాలో అర్థంకాక..
ఆ నిరుపేద నిర్మాణంలో ఉన్న తన ఇంట్లోకే చేరిపోయాడు..
పరచిన కంకరపైనే పడుకున్నాడు..
విద్యుత్ లేని ఆ చీకటి ఇంట్లో బతుకీడుస్తున్నాడు..

టీడీపీ సానుభూతిపరుడిపై వైసీపీ మూకల దాష్టీకం
ప్రచారంలో పాల్గొన్నందుకు దుర్భాషలు
అద్దె ఇల్లు ఖాళీ చేయించిన వైనం
నిర్మాణంలో ఉన్న తన ఇంట్లోకి బాధితుడు



పడిపోయిన ఈ ఇంట్లోని చిన్న పాకలోనే ఫక్కీరప్ప అద్దెకు ఉండేవాడు..

కొత్తచెరువు, ఏప్రిల్ 26: వైసీపీ మూకల దాష్టీకానికి ఇది పరాకాష్ట. మండలంలోని తలమర్ల గ్రామంలో టీడీపీ సానుభూతిపరుడు, మైనార్టీ వర్గానికి చెందిన దూదేకుల ఫక్కీరప్పపై దౌర్జన్యానికి దిగారు. గ్రామంలో ఈనెల 25న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి.. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో ఫక్కీరప్ప పాల్గొన్నాడు. దీంతో గ్రామానికి చెందిన వైసీపీ మూకలు నడిపి రెడ్డెప్ప, నరసింహారెడ్డి, రామసుబ్బారెడ్డి దౌర్జన్యానికి దిగారు. ఫక్కీరప్ప కుటుంబంపై అమానవీయంగా ప్రవర్తించారు. రాత్రి ఫక్కీరప్ప అద్దెకు ఉంటున్న ఇంటి వద్దకు చేరుకున్నారు. 'టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటావా, కూలి పనులు చేసుకునే వాడివి.. నీకెందుకు రా రాజకీయాలు.. నీ బతుకెంత' అంటూ అసభ్య పదజాలంతో దూషించారు. అతడిని భయభ్రాంతులకు లోనుచేసి, అద్దె ఇంటి నుంచి ఖాళీ చేయించారు. దీంతో చేసేదిలేక ఫక్కీరప్ప సామగ్రి తీసుకుని, భార్య, కుమారుడితో కలిసి నిర్మాణంలో ఉన్న తన ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి.. ఫక్కీరప్పను పరామర్శించి ధైర్యం చెప్పారు. వైసీపీ నాయకులు ఓటమి భయంతో నియోజకవర్గంలో రోజూ ఏదో ఒకచోట టీడీపీ కార్యకర్తలను వేధిస్తున్నారనీ, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ఇలాంటివి మానుకోవాలని హితవు పలికారు.



నిర్మాణంలో ఉన్న తన ఇంట్లో భార్య, కుమారుడితో ఫక్కీరప్ప

98 నామినేషన్లు ఓకే..

ఎంపీకి 15..
ఎమ్మెల్యే స్థానాలకు 83..
ముగిసిన పరిశీలన
29 వరకు ఉపసంహరణకు చాన్స్

పుట్టపర్తి, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో మరో అడుగు ముందుకు పడింది. నామినేషన్ల పరిశీలన ఘట్టం శుక్రవారం ముగిసింది. స్థానిక కలెక్టరేట్‌లో రాత్రిదాకా ఈ ప్రక్రియ కొనసాగింది. వివరాలను జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు వెల్లడించారు. హిందూపురం ఎంపీ, జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాలకు మొత్తంగా 144 నామినేషన్లు దాఖలు కాగా.. 98 ఆమోదం పొందాయి. 45 నామినేషన్లు తిరస్కరణకు లోనయ్యాయి. హిందూపురం ఎంపీకి 15 ఆమోదం పొందగా.. తొమ్మిదింటిని తిరస్కరించారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాలకు 83 నామినేషన్లు ఆమోదం పొందగా.. 36 తిరస్కరణకు లోనయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 29వ తేదీ వరకు గడువు ఉంది. ఆ తర్వాతే బరిలో నిలిచే అభ్యర్థులపై క్లారిటీ రానుంది. తుది జాబితా వెలువడనుంది.

అరాచక పాలన అంతమే కూటమి పంతం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప

హిందూపురం, ఏప్రిల్ 26: అరాచక పాలన అంతమే కూటమి పంతం అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసం వద్ద శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జగన్ పాలనలో అరాచకాలు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారులు పెచ్చుమీరాయన్నారు. 730 హామీలు ఇచ్చి, మాటతప్పిన మోసగాడు జగన్ అని ధ్వజమెత్తారు. జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాలను అణగదొక్కి, తాడేపల్లి ప్యాలెస్‌లో పైశాచిక ఆనందం పొందుతున్నాడన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రజల సమస్యలు పట్టించుకోలేదని పరదాల చాటున పెరిగాడన్నారు. ఎక్కడా అభివృద్ధి ఊసేలేదన్నారు. రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ తెచ్చారా, ఒక్క అభివృద్ధి పని చేశారా అని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చేసరికి గులకరాయి డ్రామాతో ప్రజల ముందుకు జగన్ వస్తున్నాడన్నారు. 2019లో బాబాయ్‌పై గొడ్డలివేటు, కోడికత్తి డ్రామాలతో ప్రజలను మోసం చేశాడన్నారు. ఒక్కచాన్స్ పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని మండిపడ్డారు. జగన్‌కు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు రమేష్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ్, జనసేన భాస్కర్, ఐటీడీపీ రామాంజనేయులు పాల్గొన్నారు.



కరపత్రాలను చూపుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, బీజేపీ, జనసేన నాయకులు

దుడ్లకు ఓటేస్తే అభివృద్ధి చేస్తారా ?



దుడ్లు తీసుకుని ఓట్లేస్తే.. లెక్కిచ్చినోళ్లు ఇంగ గ్రామాన్ని ఏంటికి అభివృద్ధి చేస్తారు. నాకు ఓటు హక్కు వచ్చినప్పుడు మా ఊర్లో అందరూ ఒక చోట సమావేశమై ఎవరికి ఓటు వేయాలనే దానిపై చర్చించేవారు. ఫలానా వ్యక్తికి ఓటేస్తే గ్రామంలో మంచి పనులు చేస్తాడని అందరూ కూడబలుక్కుని అతడికే ఓటేసేవారు. ఇప్పుడు అన్నింటికి దుడ్లే ప్రామాణికం అయ్యాయి. గెలిచిన తరువాత గ్రామంలో పనులు చేయాలని నాయకుడిని నిలదీసే పరిస్థితి లేకుండాపోయింది. ఒకవేళ ఎవరైనా పనులు చేయమని గట్టిగా అడిగితే మీరేమైనా ఉద్దరగా ఓట్లేశారా? దుడ్లు తీసుకున్నారు కదా..! గమ్మున ఉండండి అని ముఖం మీదే చెబుతున్నారు. అప్పట్లో సమస్యలు చెప్పిన వెంటనే పరిష్కారానికి కృషి చేసేవారు. అందుకే యువకులు ఓటు విలువ తెలుసుకుని దేశాభివృద్ధికి దాన్ని వినియోగించాలి.

- శింగనమల

ఎన్నికల గుర్తులు ఎప్పుడు మొదలయ్యాయంటే..!

కొత్తచెరువు, ఏప్రిల్ 26: ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి పార్టీకి ఎన్నికల సంఘం గుర్తులు కేటాయిస్తుంది. ఇది మన దేశంలో తొలి ఎన్నికల నుంచి ఆనవాయితీగా వస్తోంది. తొలి ఎన్నికల సమయంలో దేశంలో అక్షరాశ్యతా శాతం తక్కువగా ఉండటంతో అభ్యర్థుల పేర్లు నిరక్షరాస్యులు తెలుసుకోలేరని భావించిన ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించింది. 1952లో ఎన్నికల గుర్తులను ప్రముఖ చిత్రకారుడు ఎంఎస్ సేఠీతో పెన్సిల్ ద్వారా పలు చిత్రాలను గీయించి, వాటిలో పలు గుర్తులను బ్యాలెట్ పత్రాలలో ఉపయోగిస్తూ వచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన జాతీయ, ప్రాంతీయ, రాజకీయ పార్టీలకు వారు ఎంచుకున్న గుర్తులను కేటాయించేవారు. ఆయా రాజకీయ పార్టీల తరఫున బీఫాం సమర్పించి పోటీ చేసే అభ్యర్థులకు ఆ పార్టీ గుర్తులను కేటాయించేవారు. అయితే ప్రస్తుతం ఈవీఎంలు వచ్చాక గుర్తులతోపాటు అభ్యర్థి పేరు, ఫొటోను అందుబాటులో ఉంచుతున్నారు.



ఎన్నికల గుర్తులు

ఎన్నెన్నో మార్పులు



కదిరి అర్బన్, ఏప్రిల్ 26: తొలి ఎన్నికల నుంచి నేటి వరకు ఎన్నికల నిర్వహణలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నో సంస్కరణలు తెచ్చింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 1985వరకు ఓటు హక్కు కనీస వయసు 21ఏళ్లుగా ఉండేది. అయితే రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయసును 18 ఏళ్లకు తగ్గించారు. ఎన్నికల నిర్వహణలో సమూల సంస్కరణలు అమలు చేసిన ఘనత మాత్రం 1990లో కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టీఎన్ శేషన్‌కు దక్కుతుంది. 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా 55పార్టీలు బరిలో నిలవగా 2014నాటికి ఆసంఖ్య 370కు చేరింది. ప్రస్తుత బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించే విధానం నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్‌యంత్రాలు వినియోగించే విధానాన్ని అమలు చేస్తున్నారు. 2019 ఎన్నికల నుంచి ఓటు ఎవరికి వేశారో తెలుసుకునేందుకు ఓటరు వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రైల్(వీవీప్యాడ్) యంత్రాలను వినియోగిస్తున్నారు




టోల్‌ఫ్రీ నెంబర్ 1950 ఎందుకంటే..!

రాయదుర్గం, ఏప్రిల్ 26 : కేంద్ర ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నెంబర్ 1950 అమలులోకి తెచ్చింది. దేశవ్యాప్తంగా ఈ నెంబరుతో అన్ని జిల్లాల్లోను కాల్ సెంటర్లను ప్రారంభించింది. ముఖ్యంగా 1950నే ఎందుకు ప్రవేశపెట్టిందనే విషయం వెనుక ప్రత్యేకత దాగి ఉంది. దేశంలో ఎన్నికల సంఘం 1950లో ఏర్పడింది. అప్పటి నుంచి సార్వత్రిక, స్థానిక సంస్థలు సహా పలు రకాల ఎన్నికలను నిర్వహిస్తోంది. ఎన్నికల కమిషన్‌ను ప్రారంభించిన సంవత్సరానికి గుర్తుగా ప్రజలు మరువకుండా ఉండేలా ఈ నెంబరును దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు.

కార్మికులను ముంచిన జగన్..!

- వైసీపీ ప్రభుత్వంలో పలు సంక్షేమ పథకాలు రద్దు
- కొన్ని డీఆర్‌డీఏలో విలీనం
- భవన నిర్మాణ కార్మికులకు మొండిచేయి
- గత ప్రభుత్వ పాలనను గుర్తు చేసుకుంటున్న కార్మికులు



ఇళ్ల నిర్మాణం చేపడుతున్న భవన నిర్మాణ కార్మికులు

ధర్మవరం

ప్రతిపక్ష నేతగా తమను నమ్మించి అధికారంలోకి వచ్చాక మోసం చేశాడని సీఎం జగన్‌పై భవన నిర్మాణ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచాడని మండిపడుతున్నారు. భవన నిర్మాణ రంగంపై ఆధారపడ్డ అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం గత టీడీపీ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలుచేసిందని గుర్తు చేసుకుంటున్నారు.

పలు పథకాలు రద్దు

చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన పలు కార్మిక సంక్షేమ పథకాలను అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. ఐదారేళ్ల కిందట వివిధపథకాల కోసం వచ్చే కార్మికులతో కళకళలాడిన కార్మికశాఖ కార్యాలయం నేడు వెలవెలబోయింది. జగన్ ఆడిన ఓట్లాటలో అసంఘటిత కార్మికులు ఓడిపోయారని కార్మికసంఘాలు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వృత్తి పనిముట్లు ఇస్తే...వైసీపీ ప్రభుత్వం వాటిని ఆపేశారని తాపీ మేస్త్రీలు ఆక్రోశిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో సంఘటిత, అసంఘటిత కార్మికులు దాదాపు లక్షకుపైగా ఉన్నారు. వీరికి గత టీడీపీ ప్రభుత్వంలో పలు పథకాలు అమలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సగం పథకాలను రద్దు చేసింది. కొన్నింటిని కార్మికశాఖ నుంచి తొలగించి, గ్రామీణుల కోసం డీఆర్‌డీఏ అమలు చేస్తున్న పథకాలే కార్మికులకు కూడా వర్తిస్తాయని, ప్రత్యేకంగా కార్మిక శాఖ పర్యవేక్షణలో అమలు చేయకుండా ఆపేసింది.

నైపుణ్య శిక్షణ ఏదీ..?



భవన, ఇతర రంగాల్లో పనిచేసే సంఘటిత, అసంఘటిత కార్మికులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి టీడీపీ ప్రభుత్వం ప్రోత్సహించింది. శిక్షణకాలంలో ప్రతి రోజూ రూ.300 స్టయిఫండ్ ఇచ్చేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక నైపుణ్య శిక్షణ ఎత్తేశారు.

పరికరాలు ఎక్కడ..?

నిర్మాణరంగంలోని తాపీ మేస్త్రీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు అవసరమైన వృత్తి పనిముట్ల కోసం అప్పుల చేయాల్సిన ఉండేది. చంద్రబాబునాయుడు వారి ఆర్థిక ఇబ్బందులు గుర్తించి నాణ్యమైన వృత్తి పనిముట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఒక్కొక్క కార్మికుడికి సగటున రూ.25వేల నుంచి రూ.లక్షకు పైగా ఖర్చుచేశారని కార్మికసంఘాల నాయకులు పేర్కొంటున్నా రు. జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక వృత్తి పనిముట్ల పంపిణీ పథకాన్ని రద్దుచేశారు. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కార్మికశాఖను నిర్వీర్యం చేసిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లాల్సిందే

కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా గుర్తింపు కార్డు పొందిన కార్మికులు ఎవరైనా 18 ఏళ్ల పైబడిన తమ కూతురికి పెళ్లి చేయాలంటే చంద్రన్న పెళ్లికానుక కోసం కార్మికశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకునేవారు. అలాగే ఏదైనా ప్రమాదంలో మరణించిన, గాయపడినా చంద్రన్న బీమా కోసం కార్మిక శాఖ కార్యాలయం తలుపులు తట్టేవారు. ప్రమాదంలో మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.5లక్షలు ఇచ్చేవారు. సాధారణ మరణం అయితే రూ.60వేలు ఆర్థిక సాయం ఉండేది. గుర్తింపు కార్డులేని కార్మికులు మరణించినా కూడా రూ.50వేలు వచ్చేవి. చదువుకునే పిల్లలు ఉంటే స్కాలర్‌షిప్‌లు అందజేసేవారు. ఇవేపథకాలు డీఆర్‌డీఏ అమలు చేస్తుందని అక్కడ ఇక్కడా రెండు చోట్ల కార్మికులు లబ్ధి పొందే అవకాశం ఉందని వైసీపీ ప్రభుత్వం సరికొత్త వాదనకు తెరతీసింది. సంక్షేమ పథకాలకు డీఆర్‌డీఏకి దరఖాస్తు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంటే దాదాపు 11 సంక్షేమపథకాలు కార్మికశాఖ పరిధి నుంచి తీసేసింది. కేంద్రం అమలు చేస్తున్న ఈ శ్రమ్ తప్ప రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ఏ ఒక్క పథకం కూడా కార్మికశాఖ ప్రస్తుతం అమలు చేయడం లేదు.



కంపచెట్లు, పిచ్చి మొక్కలతో నిండిన లేఅవుట్

నల్లమాడ కనుమరుగు

- నియోజకవర్గాల పునర్విభజన ఫలితం

నల్లమాడ, ఏప్రిల్ 26: నియోజకవర్గాల పునర్విభజనలో కనుమరుగైన నియోజకవర్గాల్లో నల్లమాడ ఒకటి. 1955లో నల్లమాడ నియోజకవర్గం ఏర్పడింది. దీని పరిధిలో తనకల్లు, నల్లచెరువు, అమడగూరు, ఓడీచెరువు, నల్లమాడ మండలాలుండేవి. 1955నుంచి 2004దాకా నల్లమాడ అసెంబ్లీ స్థానానికి 11సార్లు ఎన్నికలు జరిగాయి. 2008లో జరిగిన పునర్విభజనలో నల్లమాడ నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాలు, గోరంట్ల నియోజకవర్గంలోని మూడు మండలాలను కలుపుతూ కొత్తగా పుట్టపర్తి నియోజకవర్గం ఆవిర్భవించింది. నల్లమాడ నియోజకవర్గంలో మిగిలిన మండలాలను కదిరి నియోజకవర్గంలో కలిపేశారు. ఈ నియోజకవర్గంలో 11సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆరుసార్లు కాంగ్రెస్ అభ్యర్థులు, నాలుగుసార్లు టీడీపీ అభ్యర్థులు, ఒక్కసారి స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. కాంగ్రెస్‌పార్టీ నాయకుడు అగిశం వీరప్ప 1972నుంచి 1994దాకా ఆరుసార్లు పోటీ చేసి మూడుసార్లు విజయం సాధించాడు. 1955నాటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి బయప్పరెడ్డి, కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు లక్ష్మీనారాయణరెడ్డిపై గెలుపొందారు. 1962లో కాంగ్రెస్ అభ్యర్థి వేమారెడ్డి, ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన పాపిరెడ్డి చేతిలో ఓడిపోయారు. 1972, 1978 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అగిశం వీరప గెలుపొందారు. టీడీపీ ఆవిర్భావంతో నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ పట్టు కోల్పోయింది. 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కె. రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి అగిశం వీరప్పపై గెలుపొందారు. 1985లో కూడా టీడీపీ అభ్యర్థి ఎస్. వెంకటరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి అగిశం వీరప్పపై గెలుపొందారు. 1989లో మాత్రం మళ్లీ అగిశం వీరప్ప గెలుపొందారు. 1994లో టీడీపీ అభ్యర్థి టీడీ నాగరాజారెడ్డి గెలుపొందారు. 1999లో టీడీపీ తరఫున పోటీ చేసిన పల్లె రఘునాథ్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మోహన్ రెడ్డిపై గెలుపొందారు. 2004లో పల్లె రఘునాథ్‌రెడ్డిపై మోహన్ రెడ్డి గెలుపొందారు. 2009లో ఆవిర్భవించిన పుట్టపర్తి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి పల్లె గెలుపొందారు. 2014లో కూడా మరోమారు గెలిచిన పల్లె చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు. 2019లో పల్లె రఘునాథ్‌రెడ్డిపై వైసీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ తరఫున పల్లె సింధూరా రెడ్డి, వైసీపీ అభ్యర్థి గా శ్రీధర్‌రెడ్డి ప్రధానంగా పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికల్లో ఎవరు విజయం సాధిస్తారో త్వరలో తేలనుంది.



జగనన్నా..! ఇల్లు ఏదన్నా ?

పట్టాలు ఇచ్చారు.. ఇళ్లు మరిచారు... జగనన్న కాలనీలు లేఅవుట్లకే పరిమితం

పేదలకు తప్పని సొంతింటి నిరీక్షణ



మడకశిర, ఏప్రిల్ 26: నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పేరుతో వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన గృహ నిర్మాణపథకం ఏమాత్రం ముందుకు సాగడం లేదు. పథకం ప్రారంభించి రెండేళ్లయినా ఇంత వరకు ఇళ్లు మంజూరు కాలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. సొంతిల్లు లేకపోవడంతో నిరుపేదలు కొంత మంది పూరి గుడిసెలోను, అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారు. అహుడా పరిధిలోకి వచ్చిన ప్రాంతాల్లో మాత్రం ఇళ్లు మంజూరు చేశారు. మిగతా మండలాలకు ఇళ్లు మంజూరు కాలేదు. శ్రీ సత్యసాయి జిల్లాలో 32 మండలాల్లో 25 మండలాలను అహుడా పరిధిలోకి తెచ్చారు. తాడిమర్రి, ముదిగుబ్బ, మడకశిర, అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం మండలాలు అహుడా పరిధిలోకి రాకపోవడంతో ఇళ్లు మంజూరు కాలేదు. ఈ ప్రాంతాల్లో లేఅవుట్లు వేసి పట్టాలు ఇచ్చినా నేటికి ఇళ్లు మాత్రం మంజూరు చేయలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అగళి మండలంలో 21 లేఅవుట్లలో 613 మందికి, అమరాపురం మండంలో 21 లేఅవుట్లలో 724 మందికి, గుడిబండలో 16 లేఅవుట్లలో 290 మందికి, మడకశిర మండంలో 23 లేఅవుట్లలో 332 మందికి, మడకశిర అర్బన్ ఒక లేఅవుట్‌లో 326 మందికి, రొళ్ల మండలంలో 24 లేఅవుట్లలో 261 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు. మడకశిర అర్బన్‌లో మాత్రమే జగనన్న కాలనీలో వేసిన లేఅవుట్లలో లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. అందులో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అవి వివిధ దశలలో ఉన్నాయి.

పట్టా ఇచ్చి రెండేళ్లవుతోంది: సరస్వతి, అగళి

రెండేళ్ల కిందట పట్టా ఇచ్చారు. కానీ ఇంత వరకూ ఇల్లు మంజూరు చేయలేదు. గతంలో ఉన్న పాత ఇంటిలోనే నివాసం ఉంటున్నాం. అగళి సమీపంలో లేఅవుట్ వేసి 500 మందికి పట్టాలు ఇచ్చారు. అందులో ఎవరికీ ఇళ్లు మంజూరు కాలేదు.

జనసేన పార్టీ ఎన్నికల పరిశీలకుల నియామకం



భవానీ రవికుమార్



లక్ష్మీపతి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 26: జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులను నియమించారు. ప్రతి నియో జకవర్గానికి ఇద్దరు చొప్పున మొత్తం 19 నియోజక వర్గాలకు పరిశీలకులను ని యమించారు. శుక్రవారం నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులను ఆ పార్టీ రా జకీయ కార్యదర్శి హరిప్రసాద్ విడుదల చేశారు. జిల్లాకు చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్‌ను భీమవరం అసెంబ్లీ నియోజకవర్గం, ఆ పార్టీ సీనియర్ నాయకులు కాయగూరల లక్ష్మీపతిని తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా నియమించారు. వీరందరూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వారికి కేటాయించిన నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వంతో సమన్వయం చేసుకొని పార్టీ గెలుపు కోసం పనిచేయాలని అధిష్టానం ఆదేశించింది.

చేతకాక.. చెక్కులిచ్చేశారు



హౌసింగ్ లబ్ధిదారులు చెల్లించిన అదనపు డబ్బులకు చెక్కులు ఇస్తున్న అధికారులు

యాడికి, ఏప్రిల్ 26: పేదలకు సొంతింటి కల నెరవేర్చలేమని జగనన్న ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో లబ్ధిదారులతో అదనంగా కట్టించుకున్న డబ్బులకు సంబంధించిన చెక్కులను శుక్రవారం 23మందికి అందజేసింది. సొంతింటి కల చెదరడంతో లబ్ధిదారులు ప్రభుత్వం, అధికారులకు శాపనార్థాలు పెడుతూ తమ డబ్బులకు సంబంధించిన చెక్కులను తీసుకువెళ్లారు. కొందరు లబ్ధిదారులు మాట్లాడుతూ ఏడాది కిందట తామే ఇల్లు కట్టిస్తామని రూ.35వేలు అదనంగా డబ్బులు చెల్లించాలని ప్రభుత్వం చెప్పడంతో వడ్డీకి అప్పులు తెచ్చి డబ్బులు కట్టామన్నారు. ఇప్పుడేమో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేక మమ్మల్ని ఇబ్బందులపాలు చేశారన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తికాలేదు, అప్పు తెచ్చిన డబ్బులకు మాత్రం వడ్డీ పెరిగింది. ఈ ప్రభుత్వానికి మా ఉసురు తగలక తప్పదు. ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామంటూ హౌసింగ్ కార్యాలయం వద్ద నుంచి వెళ్లిపోయారు.



ఒక లబ్ధిదారురాలికి వెనక్కి ఇచ్చిన చెక్కు

రూ.1.7లక్షల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదుతో వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది

ధర్మవరం, ఏప్రిల్ 26: ఎటువంటి బిల్లులు లేకుండా నగదును తీసుకెళ్తున్న వ్యక్తి నుండి రూ.1.7లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక ఎర్రగుంట్ల సర్కిల్లో శుక్రవారం తన తోపాటు ఎస్ఐ శ్రీనివాస్, ఏఎస్ఐ బాషా, సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన నల్లపరెడ్డి రూ.1లక్ష, నంద్యాల జిల్లా కలువపట్ల గ్రామానికిచెందిన బాలకంభన్న రూ.70వేలు ఎటువంటి ఆధారాలు లేకుండా తీసుకుకెళ్తుండటంతో ఎన్నికల నిబంధనల మేరకు ఆ నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

టీడీపీతోనే చేనేతల సంక్షేమం: అంబికా



కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను సన్మానిస్తున్న చేనేతలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 26: చేనేతల సమస్యల పరిష్కారం టీడీపీతోనే సాధ్యమని అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక పద్మావతి ఫంక్షన్ హాల్‌లో చేనేతలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా వారితో పాటు అనంత పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు నిమ్మల క్రిష్టప్ప హాజరయ్యారు. వైసీపీ పాలనలో చేనేతలకు జరిగిన అన్యాయంపై ఆ వర్గాలు ఆవేదన వ్యక్తం చేశారు. దగ్గుబాటి, అంబికా మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో చేనేతలకు సబ్సిడీ పథకాలు అమలు చేసి ఆదుకోవడం జరిగిందన్నారు. వైసీపీ పాలనలో సబ్సిడీలు అందక పోగా ముడిసరుకు ధరలు పెరిగి చేనేతలు కుదేలవుతున్నారన్నారు. చేనేతలను ఆదుకునేందుకు నారాలోకేశ్ స్పష్టమైన ప్రణాళికతో ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేనేతలకు పూర్వ వైభవం వస్తుందన్నారు. టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యతను చేనేతలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు పాల్గొన్నారు.

లెక్క వచ్చిందోచ్..!



యల్లనూరు, ఏప్రిల్26: ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేయడానికి వైసీపీ అభ్యర్థి నుంచి మండలంలోని రెండు గ్రామాల నాయకుల వద్దకు సొమ్ము వచ్చిందనే ప్రచారం జోరుగా వినిపిస్తోంది. నమ్మకం ఉన్న నాయకుల వద్ద ఈ డబ్బు డంప్ చేశారని సమాచారం. పోలింగ్‌కు రెండురోజులకు ముందు రెండుగ్రామాల నుంచి మండలవ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తారని తెలిసింది. ఈ విషయం గురించి మండలంలో తీవ్ర చర్చ జరుగుతోంది.

ఏ ముఖంతో ఓట్లు అడుగుతాడో..!



గ్రామానికి రోడ్డు వేసిన తర్వాతే ఓట్లు అడుగుతామని వైసీపీకి చెందిన యువనేత హామీ ఇచ్చి ఏడాది గడిచినా అది కార్యరూపం దాల్చలేదు. 2019లో తెలుగుదేశం హయాంలో ఉరవ కొండ నుంచి ఇంద్రావతివరకూ ఏడు కిలోమీటర్ల రోడ్డు వేయడానికి రూ.3.54 కోట్ల నిధులు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద మంజూరయ్యాయి. అప్పట్లో సాంకేతిక సమస్యల వలన పనులు ప్రారంభించలేదు. గత ఏడాది ఆగస్టులో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తనయుడు రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసిన తర్వాతనే ఓట్లు అడుగుతామని హామీ ఇచ్చారు. కానీ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. రహదారి అధ్వానంగా ఉండటంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరి ఇప్పుడు ఎన్నికల సీజన్ కాబట్టి ఏముఖం పెట్టుకుని ఆ యువనేత ఓట్లు అడుగుతాడోనని ఆ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు.

- ఉరవకొండ

కాడెడ్ల నుంచి హస్తం గుర్తు దాకా..

స్వతంత్ర భారతావనిలో జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే ఎన్నో మార్పులు వచ్చాయి. పోటీ చేసే రాజకీయ పార్టీల గుర్తుల్లో సైతం పెను మార్పులు వచ్చాయి. 1952లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గుర్తు కాడెడ్లు. ఈ గుర్తుతోనే దేశమంతా ఎన్నికల బరిలో నిలిచింది. ఆ తరువాత ఆ పార్టీ చీలిపోయి కాంగ్రెస్ (ఇందిరా)గా ఏర్పడింది. అప్పుడు దానికి ఆవు, దూడ గుర్తు కేటాయించారు. ఇదే గుర్తింపుతో 1971ఎన్నికల్లో పోటీచేశారు. ఆ తరువాత చీలిపోయిన కాంగ్రెస్ విలీనమై భారత జాతీయ కాంగ్రెస్ పేరుతో ఏర్పడింది. అప్పుడు దానికి హస్తం గుర్తును కేటాయించారు. 1977నుంచి హస్తం గుర్తుతో కాంగ్రెస్ ఎన్నికల బరిలో నిలుస్తోంది.

పీడీఎఫ్‌కు మొదట 'హస్తం'

1952సార్వత్రిక ఎన్నికల సమయంలో కమ్యూనిస్ట్ పార్టీపై నిర్బంధం ఉండటంతో పీడీఎఫ్ పేరుతో బరిలో నిలిచారు. వీరికి స్వాతంత్ర అభ్యర్థికి కేటాయించే హస్తం గుర్తు కేటాయించారు. ఆ తరువాత సీపీఐకి కంకి, కొడవలి, సీపీఎంకు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తులను కేటాయించారు. ఇవే గుర్తులతో ఆయా పార్టీలు ఎన్నికల బరిలో నిలుస్తున్నారు.

ఏం జరిగిందో..!

స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ

అధికార పార్టీ నాయకుడి ఒత్తిడే కారణమా?



రాప్తాడు, ఏప్రిల్ 26: ఎన్నికల్లో వైసీపీ ఓట్లు చీల్చే స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను అధికార పార్టీ ఒత్తిళ్లతో అధికారులు తిరస్కరించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ స్క్రూట్నీ కార్యక్రమానికి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. అధికారులపై ఒత్తిడి పెట్టి స్వతంత్ర అభ్యర్థులు సానే ఉమారాణి, ప్రకాష్‌రెడ్డి నామినేషన్లు తిరస్కరింపజేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కనుముక్కల గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే సానే చెన్నారెడ్డి కుమార్తె సానె ఉమారాణి రాప్తాడులో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అంతకుముందే తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి ఉమారాణి ఇంటికి వెళ్లి నామినేషన్ వేయద్దని చెప్పాడు. మాకు మీరు ఏం చేశారని పోటీకి దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ఆమె రాజశేఖర్‌రెడ్డిని నిలదీసినట్లు సమాచారం. ఉమారాణి పోటీలో ఉంటే చెన్నేకొత్తపల్లి మండలంలో కొన్ని వైసీపీ ఓట్లు చీలే అవకాశం ఉంది. అందువలన తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి ఆ నామినేషన్ తిరస్కరింపచేశారని అనుమానం వ్యక్తమవుతోంది. రాప్తాడు మండలం లింగనపల్లి గ్రామానికి చెందిన కె. ప్రకాష్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేరు కూడా ప్రకాష్‌రెడ్డే. ప్రకాష్‌రెడ్డి పేరు గల స్వతంత్ర అభ్యర్థి పోటీలో ఉంటే పేరు వలన కొన్ని వైసీపీ ఓట్లు చీలే అవకాశం ఉందని ఆ నామినేషన్‌ను కూడా తిరస్కరింప చేసినట్లు అనుమానం వ్యక్తం అవుతోంది. అలాగే బోగినేపల్లి గ్రామానికి చెందిన శ్రీరెడ్డి సునీతమ్మతో వైసీపీ నాయకులు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయించారు. టీడీపీ అభ్యర్థి పేరు పరిటాల సునీత కావడంతో, స్వతంత్ర అభ్యర్థి శ్రీరెడ్డి సునీతమ్మ పోటీలో ఉంటే పేరు తికమకతో కొన్ని టీడీపీ ఓట్లు చీలే అవకాశం ఉందని భావించి పోటీలో నిలిపినట్లు తెలిసింది. అయితే శ్రీరెడ్డి సునీతమ్మ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు ఏదో కారణంతో తిరస్కరించారు. నామినేషన్లు తిరస్కరణకు గల కారణాలు రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబు తెలపలేదు.

నారా లోకేశ్‌కు బీవీ థాంక్స్

అనంతపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్‌గా నియమితులైన బీవీ వెంకటరాముడు ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్‌ను శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. టీడీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్‌గా తనను నియమించినందుకు ఆయన లోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన బీవీ వెంకటరాముడు రెండున్నర దశాబ్దాలుగా పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. జిల్లా ప్రచార కార్యదర్శిగా, యువగళం మీడియా కో-ఆర్డినేటర్ గా ఆయన పార్టీకి సేవలందించారు. ఈ సందర్భంగా బీవీ వెంకటరాముడు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఒక సామాన్య కార్యకర్తగా పార్టీకి పని చేస్తున్న తనను గుర్తించి పార్టీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్‌గా నియమించినందుకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో... మీడియాను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు.



నారా లోకేశ్‌తో బీవీ వెంకటరాముడు



పచ్చ పార్శ్వనాథ ఆలయం



కొరియన్ టౌన్‌షిప్

రాయలేలిన పెనుకొండ



కియ ట్రయల్ రన్ ప్రారంభిస్తున్న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయల పేరు చెప్పగానే పెనుకొండ గుర్తుకొస్తుంది. విజయనగర రాజుల రెండో రాజధానిగా విలసిల్లిన పెనుకొండ చరిత్ర ఘనమైనది. రాయల రాజ్యంలో ఇక్కడ వజ్ర వైఢూర్యాల రాసులతో కళకళలాడినట్లు చరిత్ర చెబుతోంది. శిల్పకళా క్షేత్రాలు, కోట గోడలు, ఆలయాలతో పాటు బాబయ్యదర్గా, గగనమహల్, జైనదేవాలయం, కొండపై ఖిల్లా, శ్రీకైలాసం లాంటి ఎన్నో విశిష్టతలు కలిగి ఉంది. భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసిన పోరాట యోధులకు జన్మనిచ్చిన గడ్డ ఇది. తర్వాత రాజకీయ చిత్రపటంలో పెనుకొండ ఫ్యాక్షన్ రాజకీయాలకు కేంద్రబిందువయింది. చివరిలో గత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చొరవతో 'కియ' కార్ల పరిశ్రమ రావడంతో పెనుకొండ ఘనత మరోసారి చరిత్ర పుటల్లోకి ఎక్కింది. పారిశ్రామికీకరణతో పెనుకొండ రూపురేఖలే మారిపోయి పూర్వ వైభవం వచ్చింది.



కియ పరిశ్రమ



- నాడు ఫ్యాక్షన్ ముద్ర.. నేడు ప్రగతి జాడ
- దక్షిణ కొరియా పెట్టుబడుల వరద
- ప్రపంచ కార్ల దిగ్గజం కియ రాకతో పూర్వ వైభవం
- పారిశ్రామిక హబ్‌గా కొత్త అధ్యాయం
- భూముల ధరలకు రెక్కలు
- కరువు నేలపై కృష్ణమ్మ పరవళ్లు
- చెరువులకు జలసిరి.. వ్యవసాయానికి పునరుజ్జీవం



ఖిల్లా

హిందూపురం/పెనుకొండ ఏప్రిల్ 26 : విజయనగర రాజుల రెండో రాజధాని, అగ్రగణ్యుడు శ్రీకృష్ణదేవరాయలు ఏలిన గడ్డ పెనుకొండ. నాడు వజ్ర వైఢూర్యాల రాసులతో పాటు కళలు, కళాఖండాలతో కళకళలాడిన పెనుకొండ ఆనవాళ్లు నేటికి చెక్కుచెదరలేదు. ఇలాంటి గడ్డపై మూడు దశాబ్దాల పాటు రాజకీయ ఆధిపత్యం కోసం ఫ్యాక్షన్, వర్గకక్షలతో రతనాలసీమలో రక్తం ఏరులైపారింది. ఒకనాడు ఫ్యాక్షన్ రాజకీయాలకు పెట్టింది పేరైన పెనుకొండ, నేడు పారిశ్రామిక, పర్యాటక హబ్‌గా మారి ప్రశాంత వాతావరణంలో ప్రపంచ పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ప్రముఖ దక్షిణ కొరియా కార్ల పరిశ్రమ కియ రాకతో ప్రపంచ పటంలో గుర్తింపు పొందుతోంది. విదేశీ, స్వదేశీ సంస్కృతులను కలబోసుకుని అభివృద్ధి వైపు పరుగులు పెడుతోంది. ఓ వైపు పారిశ్రామిక అభివృద్ధి మరో వైపు వ్యవసాయ ప్రమాణాలను పెంచుతూ ముందుకు దూసుకుపోతుంది. కరువు కటాకాలకు అల్లాడి వలసలు వెళ్లిన వారు సైతం కృష్ణమ్మ పరవళ్లతో వెనుదిరిగి వస్తున్నారు. 1952 మొదటి సారిగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థి వెంగళమ్మ చెరువు లక్ష్మీనారాయణరెడ్డి ఎన్నికయ్యారు. నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్లు 265, మొత్తం ఓటర్లు 2,33,687 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 1,17,311, మహిళలు 1,16,372, ఇతరులు 3 ఉన్నారు. నియోజకవర్గం 3,49,593.27ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది.

గెలిచిన ఎమ్మెల్యేలు

సంవత్సరం	విజేత	పార్టీ
1952	వి. లక్ష్మీనారాయణరెడ్డి	ఇండిపెండెంట్
1957	చితంబరరెడ్డి	కాంగ్రెస్
1962	నర్సిరెడ్డి	ఇండిపెండెంట్
1967	ఎస్.రెడ్డి	కాంగ్రెస్
1972	ఎస్‌డీ నారాయణరెడ్డి	కాంగ్రెస్
1978	ఎస్. నారాయణరెడ్డి	కాంగ్రెస్
1983	ఎస్. రామచంద్రారెడ్డి	ఇండిపెండెంట్
1985	ఎస్. రామచంద్రారెడ్డి	టీడీపీ
1989	ఎస్. చంద్రారెడ్డి	కాంగ్రెస్
1991	ఎస్‌వీ రమణారెడ్డి	కాంగ్రెస్
1994	పరిటాల రవీంద్ర	టీడీపీ
1996	పరిటాల రవీంద్ర	టీడీపీ
1999	పరిటాల రవీంద్ర	టీడీపీ
2004	పరిటాల రవీంద్ర	టీడీపీ
2005	పరిటాల సునీత	టీడీపీ
2009	బీకే పార్థసారధి	టీడీపీ
2014	బీకే పార్థసారధి	టీడీపీ
2019	శంకరనారాయణ	వైసీపీ

రూ.13వేల కోట్లతో పెనుకొండ వద్ద కియ కార్ల, అనుబంధ పరిశ్రమలు, హంద్రీనీవా ప్రాజెక్ట్, గార్మెంట్స్ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. హంద్రీనీవాతో చెరువులకు నీటి రాకతో చెరువులకు జలసిరి వచ్చి కరువు నేలలో పసిడి పంటలు పండుతున్నాయి. నీరు రావడంతో పెనుకొండ వైపు ప్రపంచ దేశాల పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు ఏర్పాటు కోసం పెట్టుబడులకు తొంగి చూస్తున్నాయి.

నీళ్లే ప్రధాన సమస్య

నియోజకవర్గంలో గోరంట్ల మినహా నాలుగు మండలాలకు హంద్రీనీవా మడకశిర ఉప కాలువ అనుసంధానంగా ఉంది. అయినా ప్రధానంగా చెరులన్నింటికి నీరు నింపకపోవడంతో సాగు, తాగు నీరు సమస్య ఉంది. ప్రధానంగా గోరంట్ల, పరిగి, రొద్దంలో తాగు నీటి సమస్య అధికంగా ఉంది. నియోజకవర్గంలో వర్షాధార పంటలపైనే రైతాంగం ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా చెరువులకు నీరులేక రైతులు, కూలీలు వసలు వెళ్లారు. గోరంట్ల మండలానికి హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలు ఇవ్వాలన్న ప్రతిపాదన దశలోనే ఉంది. పెనుకొండను ప్రపంచ పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలని 2010 నుంచే శ్రీకృష్ణదేవరాయలు ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. నేటికీ ఇచ్చిన హామీలను పాలకులు పూర్తి చేయలేక పర్యాటకులను ఆకర్షించలేకపోతోంది. పెనుకొండ వద్ద రైల్వే ఫ్లైఓవర్, లేక అండర్‌బ్రిడ్జ్ నిర్మాణం, గోరంట్ల, సోమందేపల్లిలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు లేవు. చేనేతలకు ఆదరణ కరువై పవర్‌లూమ్స్ వైపు మళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పరిశ్రమలు వచ్చినా నిరుద్యోగ సమస్యకు మాత్రం చెక్ పడలేదు.

గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణంతో మలుపు

హంద్రీనీవాలో భాగంగా 2016లో గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తయింది. అదే ఏడాది డిసెంబరు నెలలో కృష్ణా జలాలను నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేశారు. దీంతో పాటు కియ కార్ల పరిశ్రమ పెనుకొండ సమీపంలోని అమ్మవారిపల్లి, యర్రమంచి వద్ద ఏర్పాటైంది. ఈ పరిశ్రమకు అనుబంధంగా పెనుకొండ, సోమందేపల్లి, గోరంట్ల ప్రాంతాల్లో మరో 20 పరిశ్రమలు రావడంతో వేలకోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చిపడ్డాయి. పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న భూములపై కియ ప్రభావం పడడంతో లక్షలు పలికే భూములు కోట్లలోకి చేరాయి. ఫలితంగా ఆకాశాన్ని తాకే మూడు, ఐదు అంతస్థుల భవనాల నిర్మాణాలతో పెనుకొండలో కియ కార్ల పరిశ్రమతో దక్షిణ కొరియా దేశస్థులు రాక సంఖ్య పెరిగింది. ప్రజల ఆర్థిక జీవనవిధానంలో పెనుమార్పులు వచ్చాయి.

పెనుకొండకు ప్రపంచ పెట్టుబడులు

2015లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన నాసెన్, బెల్, ఎయిర్‌బస్‌లు పాలసముద్రం వద్ద ఏర్పాట్లకు ముందుకొచ్చాయి. 2016లో

ప్రపంచ పటంలో పెనుకొండను చూపిన కియ

తెలుగుదేశం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఉమ్మడి అనంత జిల్లాను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కియా పరిశ్రమను పెనుకొండకు తీసుకొచ్చారు. దీంతో పెనుకొండ పేరును ప్రపంచ పటంలో కియా నిలిపిందనడంలో సందేహం లేదు. 2016లో రూ.13వేల కోట్లతో కియా పరిశ్రమను స్థాపించారు. అప్పట్లో చంద్రబాబు తీసుకున్న నిర్ణయం, ఆయన మీదున్న నమ్మకంతో కియా పరిశ్రమ యజమాని ఇక్కడ పరిశ్రమ పెట్టడానికి ముందుకొచ్చారు. ఒప్పందం ప్రకారం భూమిని ఇవ్వడంతోపాటు నీటిని అందించడం మౌళిక సదుపాయాలు ప్రభుత్వం నుంచి అనుమతులను వేగవంతం చేయించారు. చెప్పిన సమయానికంటే ముందుగానే వారికి అప్పగించడంతో శరవేగంగా కియా పరిశ్రమ ప్రారంభమైంది. దీనివల్ల కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన నాసెన్, బెల్, ఎయిర్‌బస్ సంస్థలు కూడా పెనుకొండ నియోజకవర్గానికి తరలివచ్చాయి. దీంతోపాటు కియా అనుబంధ పరిశ్రమలుకూడా ఇక్కడ కొన్ని ఏర్పాటు చేశారు. ఈ పరిశ్రమ రాకతో ఎకరా భూమి వేలల్లో ఉండగా ప్రస్తుతం కోట్లకు చేరింది. దీనివల్ల ఈ ప్రాంతంలోని జీవన ప్రమాణాలు, స్థితిగతులు ఒక్కసారిగా మారిపోయాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేల మందికి ఉపాధి కల్పించింది. దీని వల్ల పెనుకొండ నియోజకవర్గ రూపురేఖలు మారాయని చెప్పవచ్చు.

పెనుకొండ శ్రీకృష్ణదేవరాయల వేసవి విడిదిగా చరిత్రకెక్కింది. ఇక్కడ ప్రధానమైన శిల్పకళా క్షేత్రాలు, కోటగోడలు, ఆలయాలతో పాటు బాబయ్యదర్గా, గగనమహల్, దక్షిణ భారతంలోని జైనదేవాలయం, కొండపై ఖిల్లా,

చారిత్రకత, పర్యాటక ప్రదేశాలు

గగన్‌మహల్, శ్రీకైలాసం, గుడిపల్లి సజ్జగంట రంగనాథస్వామి, గోరంట్లలో మాదవరాయుల దేవస్థానం, రుద్రపాదం, కుంభకర్ణ ప్రాజెక్టులు ఉన్నాయి.

ఫ్యాక్షన్ గడ్డపై శాంతి కుసుమాలు

పెనుకొండ అంటే ఫ్యాక్షన్ రాజకీయాలకు పెట్టింది పేరు. భూపెత్తందారుల నుంచి పేదలకు భూములు పంచాలన్న పోరాటయోధులకు జన్మనిచ్చిన గడ్డ ఇది. 1989 నుంచి ఇక్కడ రాజకీయ ఆధిపత్యం కోసం మూడు దశాబ్దాల పాటు ఫ్యాక్షన్ బీజం నాటుకుంది. ఈ ఫ్యాక్షన్ భూతంలో ఎందరో ఆసువులు బాశారు. పెనుకొండ నియోజకవర్గంలో సోమందేపల్లి, రొద్దం, పెనుకొండ, కనగానిపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి ఉండేవి. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి రాప్తాడులోకి విలీనం కాగా పెనుకొండలోకి పరిగి, గోరంట్ల మండలాలు కలిశాయి. ఈ నియోజకవర్గంలో రెండు సార్లు ఉపఎన్నికలు జరిగాయి. ఫ్యాక్షన్ భూతం క్రమంగా అంతరించిపోయి ప్రస్తుతం అభివృద్ధి పరుగులు పెడుతోంది. 1952 నుంచి ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరగగా మూడుసార్లు ఉప ఎన్నికలు జరిగాయి.



గొల్లపల్లి రిజర్వాయర్‌తో సస్యశ్యామలం

ఒకప్పుడు తాగునీటికి కూడా కటకటలాడే ఈ ప్రాంతం ఎక్కడచూసినా వర్షాలుపడక, పంటలు పెట్టక అడవుల్లా మారిన భూములు దర్శనమిచ్చేవి. అలాంటి భూములను సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గొల్లపల్లి రిజర్వాయర్ 2016లో నిర్మాణం పూర్తిచేశారు. అదేఏడాది డిసెంబర్‌లో కృష్ణాజలాలను రప్పించారు. దీనివల్ల ఒకవైపు ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కియా పరిశ్రమకు నీటిని అందించడంతోపాటు దశాబ్దాల కాలంగా తాగునీటి సమస్యతో తల్లడిల్లుతున్న హిందూపురం పట్టణానికి శాశ్వతంగా పరిష్కారం లభించింది. దీంతోపాటు పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల చెరువులకు సాగునీటిని కూడా ఇక్కడి నుంచే అందించేందుకు శ్రీకారం చుట్టారు. దీని సామర్థ్యం 1.6 టీఎంసీలు కాగా 1టీఎంసీ సాగునీరుకు, 0.6టీఎంసీ కియా, హిందూపురానికి కేటాయించారు. దీని వల్ల వందలాది బోర్లలో సమృద్ధిగా నీరు వస్తున్నాయి. చెరువుల కింద పంటలుపండుతున్నాయి. వైసీపీ వచ్చాక రెండేళ్లుగా చెరువులకు నీరు ఇవ్వలేదు.

ప్రధాన సంస్థలు

ప్రాజెక్ట్, గాలిమరలు, సోలార్, పట్టుగుడ్ల ఉత్పత్తి కేంద్రం, పెనుకొండ రెవిన్యూ డివిజన్ కేంద్రంతోపాటు పలు డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి.

పెను(కొండ) సంచలనం

పెనుకొండ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి 18సార్లు ఎన్నికలు జరగగా రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థులు, ఆరుసార్లు ఆవు, దూడ, ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. ఎనిమిది సార్లు టీడీపీ అభ్యర్థులే గెలుపొందారు. 1994 నుంచి పరిటాల రవీంద్ర గెలుపుతో ప్రారంభమైన టీడీపీ ప్రభంజనం 2019 వరకు ఓటమి ఎరుగదు. పెనుకొండ నుంచి తొలి మంత్రి పదవి ఎన్టీఆర్ మంత్రి వర్గంలో 18 శాఖలు ఎస్.రామచంద్రరెడ్డికి వరించగా రెండోసారి పరిటాల రవీంద్ర కార్మికశాఖ మంత్రిగా పనిచేశారు. పెనుకొండ రాజకీయాలను మూడు దశాబ్దాల పాటు రామగిరి, ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల నాయకులే ప్రభావితం చేశారు.



అప్పనంగా..

- వైసీపీకి నగర నడిబొడ్డున స్థలం ధారాదత్తం
- 33 ఏళ్ల లీజుకు రెండెకరాల హెచ్చెల్సీ స్థలం
- వేగంగా అధికారపార్టీ కార్యాలయ నిర్మాణం
- జలవనరులశాఖ కార్యాలయం నిర్మాణం కలే !
- మూడు ముక్కలుగా హెచ్చెల్సీ ఎస్ఈ శాఖ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 26: నగర నడిబొడ్డున రూ.కోట్లు విలువ చేసే రెండెకరాల హెచ్చెల్సీ స్థలాన్ని ప్రభుత్వం వైసీపీకి ధారాదత్తం చేసింది. లీజు పేరిట 33ఏళ్లకు ఏడాదికి రూ.వెయ్యి ప్రకారం రెండెకరాలు కేటాయించింది. అయితే ప్రస్తుత మార్కెట్ రేట్ల ప్రకారం ఎకరం స్థలానికి కనీసం రూ.10లక్షలు చెల్లించే అవకాశం ఉంది. అలాంటిది ప్రభుత్వ పెద్దలు తమ పార్టీకి రెండెకరాలను కేవలం రూ.వెయ్యికి ఇవ్వడం వివాదాస్పదమవుతోంది. అసెంబ్లీలో 50శాతం కంటే ఎక్కువ సీట్లు ఉన్న పార్టీకి స్థలాన్ని కేటాయించవచ్చనే జీఓను వైసీపీ తనకు అనుకూలంగా మలుచుకుంది.

అడిగేదెవరు..?

అధికార పార్టీ హెచ్చెల్సీ స్థలాన్ని లీజు పేరుతో కొట్టేసి పార్టీ కార్యాలయం నిర్మిస్తున్నా అడిగేనాథుడే లేడు. గతంలో ప్రభుత్వ స్థలాలను రాజకీయ పార్టీల భవన నిర్మాణాలకు ఇచ్చేవారు కాదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం పాత విధానాలకు స్వస్థి పలికి కొత్త విధానికి తెరలేపింది. ఎన్ని విమర్శలు వచ్చినా పట్టించుకోకుండా జలవనరుల శాఖ ఉన్నతాధికారులు అధికార పార్టీ కార్యాలయం నిర్మాణానికి స్థలాన్ని లీజు పేరుతో ముట్టజెప్పారు. మరోవైపు నగర నడిబొడ్డున హెచ్చెల్సీ కార్యాలయాన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి విస్తరణ పేరుతో ఖాళీ చేయించారు. దీంతో హెచ్చెల్సీ కాలనీలోని మూడు గదుల్లోకి కార్యాలయాన్ని మార్చారు. రెండున్నరేళ్ల నుంచి కార్యాలయం ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నా ప్రభుత్వం హెచ్చెల్సీ కార్యాలయానికి స్థలం, నిధులు కేటాయించలేదు. అయితే సొంత పార్టీకి మాత్రం విశాలమైన భవనాలు నిర్మిస్తోంది. జిల్లాలో 2.85లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అధికారి కార్యాలయానికి స్థలం, కార్యాలయం కేటాయించకపోవడం, నిర్మాణానికి నిధులు ఇవ్వకపోవడం దారుణమనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మూడు ముక్కలుగా హెచ్చెల్సీ కార్యాలయం

హెచ్చెల్సీ కార్యాలయాన్ని మూడు ముక్కలు చేశారు. సుమారు 20ఎకరాలకు పైగా సొంత స్థలం ఉన్నా సొంత భవనం నిర్మించుకోలేని దుస్థితిలో హెచ్చెల్సీ శాఖ ఉంది. రెండేళ్ల కిందట తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయాన్ని బలవంతంగా ఖాళీ చేయించారు. అక్కడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నిర్మాణాలు చేపట్టారు. దీంతో హెచ్చెల్సీ కాలనీలో సొంత స్థలం ఉంది కదా అక్కడ కార్యాలయం నిర్మించుకోవచ్చు అని అనుకున్నారు. ఈ కాలనీలో ఎస్ఈ కార్యాలయాన్ని ఒక చోట, డిప్యూటీ ఎస్ఈ ఒక చోట, మిగిలిన సిబ్బంది, రికార్డుల కోసం ఒక గదిని కేటాయించారు. దీంతో హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయం మూడు ముక్కలైనట్లయ్యింది. అయితే ఇంతవరకు సొంత భవనానికి సంబంధించి నిధులు, నిబంధనలు జారీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆశాఖ ఉద్యోగులు వాపోతున్నారు. జలవనరుల శాఖ సీఈ కార్యాలయం నిర్మించాలని రెండెకరాల స్థలంలో కాంపౌండ్ వాల్ నిర్మించారు. మట్టి తవ్వారు ఇక అంతే ఒక్క అడుగూ ముందుకు పడలేదు. కానీ 9 నెలల కిందట ప్రారంభించిన వైసీపీ కార్యాలయం నిర్మాణం మాత్రం వేగంగా జరుగుతుండటం గమనార్హం.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే...



ఉన్నతాధికారుల ఆదేశాలు, ఉత్తర్వుల మేరకు స్థలం కేటాయించారు. తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ కార్యాలయాన్ని ఉన్నఫలంగా ఖాళీ చేయమన్నారు. దీంతో హెచ్చెల్సీ కాలనీలోని ఓ గదిలోకి కార్యాలయాన్ని మార్చాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఎస్ఈ కార్యాలయాన్ని మూడు గదుల్లో వేర్వేరుగా నిర్వహిస్తున్నాం. జలవనరుల శాఖ, హెచ్చెల్సీ కార్యాలయం నిర్మాణానికి స్థలం, నిధుల కోసం ఉన్నతాధికారులకు పలు మార్లు లేఖలు రాశాం. అయితే ఇంతవరకు ఉన్నతాధికారులు నుంచి ఎటువంటి స్పందన రాలేదు.

- రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్ఈ



హెచ్చెల్సీ స్థలంలో వేగంగా నిర్మించిన వైసీపీ కార్యాలయం

శాసనసభ నియోజకవర్గానికి ఓ నంబర్...!

రాయదుర్గం: ప్రతి ఊరికి ఉత్తరప్రత్యుత్తరాలు నిర్వహించేందుకు ఓ పిన్‌కోడ్ ఉన్నట్లుగానే, ల్యాండ్‌లైన్, సెల్‌ఫోన్లకు ఓ నంబర్ ఉంటుంది. అదే పద్ధతిలో శాసనసభ నియోజకవర్గాలకు ఎన్నికల సంఘం ఓ నెంబర్‌ను కేటాయించింది. ఆ నెంబర్ ఆధారంగానే నియోజకవర్గాల నుంచి ఎన్నికల వివరాల సేకరణ, పోలింగ్ ఏర్పాట్లను నిర్వహిస్తారు. రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్ సైట్‌లో నియోజకవర్గానికి సంబంధించిన ఏదైనా సమాచారం తెలుసుకునేందుకు ఆ నెంబర్ తెలియజేయడం ఎంతో ముఖ్యం. ఉమ్మడి జిల్లాలోని 14 శాసనసభ నియోజకవర్గాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం కేటా యించిన నెంబర్ల వివరాలు ముఖ్యంగా జిల్లాకు కేటాయించిన నెంబర్లలో వరుసగా రాయదుర్గం నుంచి ప్రారంభమై కదిరితో ముగుస్తాయి. 148- రాయదుర్గం, 149- ఉరవకొండ, 150-గుంతకల్లు, 151- తాడిపత్రి, 152- శింగనమల (ఎస్సీ), 153- అనంతపురం అర్బన్, 154- కళ్యాణదుర్గం, 155- రాప్తాడు, 156- మడకశిర (ఎస్సీ), 157- హిందూపురం, 158- పెనుకొండ, 159-పుట్టపర్తి, 160-ధర్మవరం, 161- కదిరి నియోజకవర్గాలు ఉన్నాయి. ఉదాహరణకు రాయదుర్గం నియోజకవర్గ ఎన్నికల వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చూడాలంటే 148-రాయదుర్గం నియోజక వర్గం అని నమోదు చేసి చూసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికలకు సంబంధించిన కార్యకలాపాలను కూడా అధికారులు నియోజకవర్గాలకు కేటాయించిన నెంబర్ల ఆధారంగానే నిర్వహిస్తారు. ముందుగా నియోజకవర్గ సంఖ్యను రాసి తరువాత ఆ వివరాలను అధికారులు పొందుపరుస్తారు.

అప్పుడే మొదలైందా..!

తాడిపత్రిలో ఉద్రిక్తత...

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 26: నామినేషన్ల స్క్రూటీని విషయంలో శుక్రవారం తాడిపత్రిలో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నామినేషన్ల పరిశీలనకు టీడీపీ తరఫున మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ తరఫున ఎమ్మెల్యే పెద్దారెడ్డి తనయుడు హర్షవర్దన్‌రెడ్డి కార్యాలయానికి వెళ్లారు. నామినేషన్ పత్రాలను ఎవరికి వారు సరిచూసుకుంటున్నారు. ఇదే సమయంలో వైసీపీ సోషల్‌మీడియా యాక్టివిస్ట్ ప్రభాకర్ కార్యాలయంలోకి వెళ్లడానికి ప్రయత్నించాడు. నిబంధనలను ఉల్లంఘిస్తూ కార్యాలయంలోకి ఎలా వెళతావంటూ అక్కడే ఉన్న టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో వైసీపీ కార్యకర్తలు ప్రభాకర్ వైపుగా వచ్చారు. ఇటు టీడీపీ శ్రేణులు, వైసీపీ శ్రేణులు ఎదురెదురుగా కేకలు, అరుపులతో ఆ ప్రాంతాన్ని భీతిగొలిపేలా చేశారు. స్థానికులు ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురయ్యారు. డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అక్కడి నుంచి ఇరువర్గాలను పంపించేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.



తహశీల్దార్ కార్యాలయంలోకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న వైసీపీ మద్దతుదారులను అడ్డుకుంటున్న పోలీసులు

వైసీపీ పాలనలో కానరాని అభివృద్ధి

ఎన్నికల ప్రచారంలో పల్లె సింధూరారెడ్డి


ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న పల్లె సింధూర

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 26: వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎక్కడా అభివృద్ధి కనపడడం లేదని, ముఖ్యంగా గ్రామాల్లో అయితే ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అల్లాపల్లి పంచాయతీ పగడాలవారిపల్లి, కొక్కంటివారిపల్లి, యర్రబల్లి గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. అనంతరం మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎక్కడా ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదన్నారు. గ్రామాల్లో అయితే చిన్న చిన్న సమస్యల్ని కూడా పరిష్కరించలేదన్నారు. కేంద్రం ఇచ్చే స్థానిక సంస్థల నిధులను సర్పంచుల ఖాతాల్లోకి వెళ్లకుండా వైసీపీ ప్రభుత్వమే ఇతర వాటికి వాడుకుందని తెలిపారు. అందుకే ఏ గ్రామంలో చూసినా అభివృద్ధి జాడ కనబడటం లేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే గ్రామాల అభివృద్ధి చేస్తామన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో కియ లాంటి అంతర్జాతీయ పరిశ్రమ ఏర్పాటుకు తన వంతు కృషిచేయడంతోపాటు 193చెరువులు నింపుతామని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీకే పార్థసారథిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

మండలంలోని మాలప్పగారిపల్లికి చెందిన మాసే మునీంద్ర, పగడాలపల్లి రామాంజనేయులు ఆధ్వర్యంలో పది కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ప్రచారంలో ఉన్న పల్లె సింధూరారెడ్డిని వారు కలిసి పార్టీలోకి చేరారు. ఆమె వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జయచంద్ర, రెస్కో మాజీ చైర్మన్ రాజశేఖర్, నాయకులు ఎద్దుల ప్రమోద్‌రెడ్డి, బోయపల్లి శివారెడ్డి, క్రిష్ణమూర్తి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

14 కుటుంబాలు టీడీపీలోకి చేరిక..

నల్లమాడ: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సొంత గ్రామమైన పాతబత్తలపల్లి పంచాయతీ నల్ల సిన్నయ్యగారిపల్లిలో వైసీపీకి ఎదురుదెబ్బ పడింది. సుమారు 14 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. పుట్టపర్తిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం వారు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో మాడిశెట్టి ప్రసాద్, గోపాలం నాగరాజు, హుస్సేన్‌బాషా, సలాంవలి, వెంకటరమణప్ప, ఆదినారాయణ, ఫిరోజ్, హైదర్‌వలి, మహేష్, గోపాలం, హరిప్రసాద్, మస్తాన్‌బాషా, హరి తదితరులు ఉన్నారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే తీరుతో విసిగిపోయామని, వైసీపీలో న్యాయం జరగదని గ్రహించి టీడీపీలోకి చేరామని తెలిపారు.

పల్లెసింధూరను గెలిపిద్దాం


బుక్కపట్నంలో ప్రచారం చేస్తున్న మాజీమంత్రి పల్లె

బుక్కపట్నం: మండలకేంద్రంలో మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి ఎన్నికల ప్రచారాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి పల్లె సింధూరను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారథిని ఎంపీగా గెలిపించాలని ప్రజలను కోరారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మోసకారి మాటలు చెబుతున్నారని, ఆయన మాటలను ఎవరూ నమ్మొద్దని తెలిపారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెదరాశుసుబ్రమణ్యం, చెన్నక్రిష్ణ, వారాధి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అవినీతి వైసీపీని తరిమికొట్టండి

● ఎన్నికల ప్రచారంలో కందికుంట వెంకటప్రసాద్ పిలుపు


సోమరాజుకుంటలో కందికుంటకు ఘన స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

నంబులపూలకుంట, ఏప్రిల్ 26: గడిచిన ఐదేళ్లలో అవినీతి పాలన సాగించిన వైసీపీని ప్రజలు ఈ ఎన్నికల్లో తరిమికొట్టాలని టీడీపీ కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని సోమరాజకుంట, కుంట్లపల్లి, కోటిరెడ్డివారిపల్లి, ధనియానిచెరువు, హరిజనవాడ, పాతూరు, గోవిందరాజులపల్లి, బి.కొత్తపల్లి, వంకమద్ది, పోరెడ్డివారిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. తర్వాత ఆయన ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే తనను, ఎంపీగా బీకే పార్థసారధని గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించి.. చంద్రబాబు సీఎం కాగానే వాటిని అమలు చేస్తారని తెలిపారు. ధనియానిచెరువులో ప్రచారం ముగించుకుని విలేకరులతో మాట్లాడారు. ఏ గ్రామంలో చూసినా తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. తాగునీటి కోసం ప్రజలు పడుతున్న పాట్లు వర్ణణాతీతంగా ఉన్నాయన్నారు. ప్రజలు కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ప్రజలకు ఏమి చేసిందని మండిపడ్డారు. కనీసం తాగునీరు కూడా ఇవ్వలేదని అన్నారు. అవినీతి వైసీపీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు ప్రస్తుత వైసీపీ అభ్యర్థికి ఈ నియోజకవర్గ సమస్యలపై కొంచెం కూడా అవగాహన లేదన్నారు. నియోజకవర్గంలో హిందూ ముస్లింలు సమైక్య భావంతో జీవిస్తున్నారన్నారు. అయితే కొందరు అశాంతిని నెలకొల్పే పరిస్థితులు తీసుకురావాలని చూస్తున్నారన్నారు. అలాంటి వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక..

కదిరి అర్బన్: కదిరి మండలం కే.కుంట్లపల్లికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పట్టణంలోని కందికుంట నివాసంలో వారు ఆయన సమక్షంలో పార్టీలోకి చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రామచంద్రారెడ్డి, గోపీనాథ్, చెన్నప్ప ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు పోగునూరు చెన్నకేశవులు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి సాధ్యం: రత్నకుమార్


మద్దన్నగారిపల్లిలో సత్యకుమార్‌కు హారతి పడుతున్న మహిళలు


18వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న సత్యకుమార్ సతీమణి త్రివేణి

ముదిగుబ్బ, ఏప్రిల్ 26: కూటమి గెలిస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ పేర్కొన్నారు. మండలంలోని టీఎన్ పాళ్యం, బసిరెడ్డి పల్లి, ఇరికిరెడ్డిపల్లి, గుట్టకిందపల్లి, ఆకుతోటపల్లి, మల్లేపల్లి, తప్పిటవారిపల్లి, కొండగట్టుపల్లి, మద్దన్నగారిపల్లి, ఒడ్డుకింద తండాలలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ కమలం గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుకు ఓటు వేసి బీకే పార్థసారధని ఎంపీగా గెలిపించాలన్నారు. కూటమి అధికారంలోకి వస్తేనే ప్రజలకు సంక్షేమ పథకాలు క్రమం తప్పకుండా అందుతాయని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

అవినీతికి చిరునామా వైసీపీ

అవినీతికి చిరునామా వైసీపీ అని, సంక్షేమం పేరుతో ప్రజలను మోసం చేస్తోందని సత్యకుమార్ పేర్కొన్నారు. ముదిగుబ్బ మండలం మద్దన్నగారిపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ముఖ్యంగా సీపీఎస్ రద్దు చేయలేదని, పీఆర్సీ పెంచలేదని, మద్యపానం నిషేధించలేదని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయలేదని ఎద్దేవా చేశారు. ఈసారి రాష్ట్రంలో ప్రభుత్వం మార్పు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రతిఒక్కరికీ సూపర్ సిక్స్ పథకాలు అందిస్తామన్నారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. జిల్లేడుబండ, చిత్రావతి బ్యాలెన్స్ రిజర్వాయర్ ముంపు రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

ప్రచారంలో ఉన్న సత్యకుమార్ ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. మండలంలోని కొండగట్టుపల్లి, మద్దన్నగారిపల్లి, ఒడ్డుకింద తండా ల నుంచి దాదాపు 60కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. వీరికి ఆ పార్టీ మండల నాయకులు కండువాలు కప్పి ఆహ్వానించారు. అందరం కలసి కట్టుగాపనిచేసి కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు.

సత్యకుమార్ సతీమణి ముమ్మర ప్రచారం

ధర్మవరం: పట్టణంలోని 18వ వార్డులో కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ సతీమణి త్రివేణి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యేఅభ్యర్థికి కమలం గుర్తుకు, ఎంపీ అభ్యర్థికి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ధర్మవరం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే సత్యకుమార్‌ను గెలిపించాలన్నారు. దోపిడీకి పాల్పడుతున్న వైసీపీని ఇంటికి సాగనంపాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కత్తులసునీత, కత్తుల బాబీ, నాగరాజు, నిర్మలకృష్ణ, షామీర్, బీబీ, స్వర్ణ, మున్ని, అఖిల, మీనాక్షి, మహేశ్వరి, చౌడమ్మపద్మావతి, ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు సత్యకుమార్ పర్యటన

బత్తలపల్లి, ఏప్రిల్ 26: మండలంలోని పలు గ్రామాలలో కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ శనివారం పర్యటించనున్నట్టు ఆ పార్టీ మండల నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వరదాపురం,విశ్వనాథపురం, చిన్నయకుంటపల్లి, ఓబుళాపురం, రామాపురం, కోడేకండ్ల, జ్వలాపురం, తంబాపురం,చెన్నరాయపట్నం, అప్రాచెరువు, గుమ్మల్లకుంట, పోట్లమర్రి గ్రామాలలో పర్యటించనున్నారన్నారు. కూటమి శ్రేణులు తరలిరావాలన్నారు.

దుర్గంధం, దోమల బెడద..

● ఎస్సీ కాలనీలో రోడ్లపై పారుతున్న మురుగునీరు ● ఇబ్బంది పడుతున్న స్థానికులు



ఎస్సీకాలనీలోని వీధుల్లో రోడ్లపై పారుతున్న మురుగునీరు

నల్లమాడ, ఏప్రిల్ 26: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఏన్నోయేళ్లుగా డ్రైనేజీ సమస్య నెలకొంది. అక్కడ డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లలోంచి వచ్చే మురుగునీరంతా రోడ్లపై ఇళ్ల ముందరే పారుతోంది. దీంతో వాటి నుంచి వచ్చే దుర్గంధం భరించలేకున్నామని, దోమల బెడదతోనూ ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఎంతోమంది ప్రజాప్రతినిధులు, అధికారులు మారుతున్నారే కానీ.. మా కాలనీ మురుగు పరిస్థితి మాత్రం మారలేదని ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా సత్యమ్మ వీధి, మసీదు వీధి నుంచి వస్తున్న మురుగు నీరు ఎస్సీకాలనీలోకి పారుతోంది. దీంతో ఎస్సీ కాలనీ వీధులన్నీ మురుగుయమయ్యాయి. మురుగు పారుతుండడంతో రోడ్లు చిత్తడిగా ఉంటున్నాయని, నడవడానికి కూడా వీలు లేని దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మురుగు వల్ల తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, దోమలు సైతం స్వైర విహారం చేస్తున్నాయని, ఫలితంగా రోగాల బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి వ్యవసాయ శాఖమంత్రి రఘువీరారెడ్డి ఈకాలనీని పరిశీలించి వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారని, అయితే ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని అంటున్నారు. ఆ తర్వాత ఎన్నికల సమయంలో చాలా మంది నాయకులు వచ్చి మేం గెలిచిన వెంటనే సమస్య పరిష్కరిస్తామని హామీలిచ్చారని, అయితే గెలిచాక ఇటువైపు కూడా చూడ లేదని మండిపడుతున్నారు. అధికారులు కూడా పలుమార్లు వచ్చి పరిశీలించి వెళ్లారని, సమస్య మాత్రం పరిష్కారం కాలేదని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

బుక్కపట్నం, ఏప్రిల్ 26: మండలంలోని లింగప్పగారిపల్లిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు మృతిచెందిన విషయం తెలిసిందే. మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి శుక్రవారం ఆ గ్రామాలకు వెళ్లి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

ధర్మవరం, ఏప్రిల్ 26: పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డు భైరవస్వామి ఆలయ సమీపంలో శుక్రవారం ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీ కొనడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సిద్దయ్యగుట్టకు చెందిన చంద్రశేఖర్, అతని భార్య కామాక్షమ్మ(45) ద్విచక్రవాహనంలో దాదులూరుకు బయలుదేరారు. అయితే రేగాటిపల్లి రోడ్డులోని భైరవస్వామి ఆలయం వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో కామాక్షమ్మ మృతి చెందగా చంద్రశేఖర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కామాక్షమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

పెద్దకోట్లలో చోరీ


తాడిమర్రి, ఏప్రిల్ 26: మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం గోగుల రాము ఇంటిలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆ ఇంటిలోకి చొరబడి అరతులం బంగారంతో పాటు రూ.50వేల నగదును ఎత్తుకెళ్లినట్టు పోలీసులు తెలిపారు. రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. నిందితుల గుర్తింపు కోసం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదికి షోకాజ్ నోటీసు

కదిరి, ఏప్రిల్ 26 : మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌కు న్యాయవాదిగా వ్యవహరిస్తూ వైసీపీ అభ్యర్థి మక్బూల్ బాషా తరఫున నామినేషన్ల పరిశీలనకు వచ్చిన ప్రసాద్‌రెడ్డిపై టీడీపీ కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ తరఫు న్యాయవాది కే. ప్రభాకర్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు. దీనికి స్పందించిన కదిరి అసెంబ్లీ ఎన్నికల అధికారి వంశీకృష్ణ షోకాజు నోటీసులు జారీ చేశామన్నారు. 48గంటల్లో సమాధానం ఇచ్చిన తరువాత స్పందిస్తామని చెప్పారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలనకు ఇరుపార్టీల తరఫు న్యాయవాదులు వచ్చారు. న్యాయవాది ప్రసాద్‌రెడ్డి ఇప్పటికే మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేస్తున్నారని, అందుకు స్పందించి మున్సిపాలిటీలో కూడా పారితోషికం తీసుకుంటున్నారని టీడీపీ తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. దీనిపై సమగ్రంగా విచారణ చేసిన తరువాత చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారి వివరణ ఇచ్చారు. అయితే నామినేషన్లు మొదటిరోజునే వైసీపీ అభ్యర్థి తరఫున నామినేషన్ వేయడానికి మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా ప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. దీనిపై నాలుగు రోజుల క్రితమే ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం వచ్చింది. అయినా ఎన్నికల అధికారులు ఇప్పటి వరకు స్పందించకపోవడం, ఇప్పుడు షోకాజునోటీసు ఇవ్వడం ఏంటని కూటమి నాయకులు ప్రశ్నిస్తున్నారు.

డబ్బు అడిగినందుకు సోదరుడి హత్య

● పెద్దమ్మ, మరో సోదరుడిపైనా దాడి


చిన్నమణికంఠ (ఫైల్)

ధర్మవరం, ఏప్రిల్ 26: పట్టుచీర డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు సోదరుడిని హత్య చేయడంతో పాటు అడ్డువచ్చిన పెద్దమ్మ, మరో సోదరుడిని కత్తితో గాయపరిచాడు ఓ కిరాతకుడు. ఈ ఘటన పట్టణంలోని గీతానగర్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గీతానగర్‌లో నివసిస్తున్న సావిత్రి మగ్గం నేసుకుంటూ పట్టుచీరలు అమ్ముతుండేది. ఆమెకు ఇద్దరు కుమారులు పెద్దమణికంఠ, చిన్నమణికంఠ(23) ఉన్నారు. కాగా సావిత్రి కొంతకాలం క్రితం ఓ పట్టుచీరను తన చెల్లెలు నారాయణమ్మ కుమారుడు రమేశ్‌కు రూ.10వేలకు అమ్మింది. అతను డబ్బు ఇంతవరకు ఇవ్వలేదు. దీంతో శుక్రవారం రాత్రి సావిత్రితో పాటు పెద్దమణికంఠ, చిన్నమణికంఠ ఎదురు ఇంట్లో ఉన్న రమేశ్‌ను డబ్బులు అడిగారు. ఈ క్రమంలో వారి మధ్య మాట మాటపెరిగింది. చివరికి రమేశ్ ఇంటిలోని కత్తి తీసుకొచ్చి చిన్నమణికంఠను విచక్షణారహితం గా పొడిచాడు. అడ్డువచ్చిన పెద్దమ్మ సావిత్రి, పెద్దమణికంఠపై కూడా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. తర్వాత పారిపోతుండగా స్థానికులు గమనించి రమేశ్‌ను పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. అనంతరం చిన్నమణికంఠను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ అతను చికిత్స పొందుతూ మృతిచెందాడు. సావిత్రి, పెద్దమణికంఠ గాయాలతో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. చిన్నమణికంఠ ఆరునెలల క్రితం ప్రేమవివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం ఆయన భార్య సుధారాణి గర్భిణి. భర్త మృతి విషయం తెలుసుకున్న ఆమె ఆస్పత్రికి వచ్చి రోదించింది. సావిత్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ, బీజేపీలోకి వలసలు


వైసీపీ నాయకులను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న సత్యకుమార్


టీడీపీలో చేరిన వలంటీరు, వైసీపీ శ్రేణులతో పరిటాల శ్రీరామ్

ధర్మవరంరూరల్, ఏప్రిల్26: మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీ నుంచి టీడీపీ, బీజేపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం మల్కాపురం గ్రామం నుంచి వైసీపీ నాయకుడు శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 50కుటుంబాల వారు బీజేపీలోకి చేరారు. అదేవిధంగా గొట్లూరు మాజీ సర్పంచ్ రామకృష్ణ, నాయకుడు సూరప్ప, వసంతపురానికి చెందిన ఉపసర్పంచ్ నాగేంద్రప్రసాద్, నాయకుడు రమేష్‌తో పాటు మరో 50కుటుంబాల వారు బీజేపీలోకి చేరారు. వీరందరికి ధర్మవరంలోని పార్టీ కార్యాలయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి గెలుపుకోసి కృషి చేయాలని వారికి సూచించారు.

ముచ్చురామిలో వలంటీర్ టీడీపీలోకి చేరిక..

మండలంలోని ముచ్చురామి గ్రామానికి చెందిన వలంటీర్ బిల్లేమురళి, వైసీపీ కార్యకర్తలు సుధీర్‌రెడ్డి, హరీష్, భాస్కర్, ఆదిశేషు, వెంకటరెడ్డి తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ధర్మవరంలోని పరిటాలక్యాంపు కార్యాలయంలో వారు పరిటాల శ్రీరామ్ సమక్షంలో పార్టీలోకి చేరారు. వీరందరికీ శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు విజయసారథి, ముచ్చురామి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి డీఈఓ అభినందనలు


విద్యార్థినిని అభినందిస్తున్న డీఈఓ

ధర్మవరం, ఏప్రిల్26: పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థిని నిత్యశ్రీ పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 594మార్కులు సాధించి ధర్మవరం పట్టణంలో ప్రథమస్థానంలో నిలిచింది. దీంతో శుక్రవారం డీఈఓ మీనాక్షి ఆ విద్యార్థినికి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నతచదువుల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల కరెస్పాండెంట్ శెట్టిపినిర్మలా జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు

నంబులపూలకుంట, ఏప్రిల్ 26: మండలంలోని గోపాలపురం- పాయకట్టు రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. గోపాలపురానికి చెందిన నాగరాజు(47) కదిరి నుంచి తెల్లవారుజామున స్వగ్రామానికి బైక్‌లో బయలుదేరాడు. కొంతదూరం వచ్చాక ఎదురుగా మరో బైక్‌లో వడ్డేపల్లికి చెందిన జయకుమార్, తులసి వచ్చారు. వేగంతో ఆ రెండు బైక్‌లు అదుపుతప్పి ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. కొద్దిసేపటికి స్థానికులు.. క్షతగాత్రులను గుర్తించి 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా నాగరాజు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జయకుమార్, తులసిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కదిరి నియోజకవర్గ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ గోపాలపురానికి వెళ్లి నాగరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అనుమానంతో భార్య హత్య


త్రివేణి (ఫైల్)

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 26: అనుమానం పెనుభూతంగా మారడంతో భర్తచేతిలో భార్య దారుణహత్యకు గురైంది. ఈ విషాదకర ఘటన మండలంలోని వెంగళమ్మచెరువులో శుక్రవారం చోటుచేసుకుంది. పుట్టపర్తి రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంగళమ్మచెరువుకు చెందిన గ్రామ వలంటీరు ఈడిగ పవన్‌కుమార్, పెడపల్లి బత్తలపల్లికి చెందిన తన మేనమామ కూతురు త్రివేణిని ఐదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. మొదట్లో వీరి కాపురం బాగానే సాగింది. అయితే గత కొంత కాలంగా పవన్‌కుమార్ భార్యపై అనుమానం పెంచుకుని తరచూ గొడవ పడుతుండేవాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి తీవ్రస్థాయిలో గొడవపడ్డాడు. ఆగ్రహానికి గురైన పవన్‌కుమార్.. త్రివేణిని కొడవలితో విచక్షణారహితంగా నరికి హత్యచేశాడు. వారికి 3 సంవత్సరాలు, 4 నెలల వయసుగల ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ కృష్ణమూర్తి పేర్కొన్నారు.

పుట్టపర్తిలో 11 నామినేషన్ల తిరస్కరణ

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి 39 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్లను పరిశీలించారు. అందులో 11 నామినేషన్లను తిరస్కరించగా, 28 సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాగ్యరేఖ తెలిపారు. తెలుగుదేశం తరఫున దాఖలు చేసిన పల్లెరఘునాథరెడ్డి, పల్లె వెంకటకృష్ణకిశోర్‌రెడ్డి, వైసీపీ తరఫున దాఖలు చేసిన దుద్దుకుంట కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ తరఫున దాఖలు చేసిన షాలినీ నామినేషన్లను పార్టీ బీఫారం పొందుపరచకపోవడంతో తిరస్కరించడం జరిగిందన్నారు. మిగతా 7నామినేషన్లు రివైజ్డ్ అఫిడవిట్, పూర్తిగా పూరించకపోవడంతో తిరస్కరించామన్నారు. ఈ నెల 29న నామినేషన్ల ఉపసంహరణ ఉన్నట్లు పేర్కొన్నారు.

ధర్మవరంలో మూడు..

ధర్మవరం: ధర్మవరం శాసనసభ అభ్యర్థిత్వానికి దాఖలైన నామినేషన్లను అధికారులు పరిశీలించారు. అందులో 3నామినేషన్లను తిరస్కరించారు. మొత్తం 26నామినేషన్లు దాఖలు కాగా ఇందులో వివిధ కారణాల వల్ల 3నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివరామిరెడ్డి తెలిపారు. ఇందులో బీజేపీ తరఫున అంబటి సతీశ్‌కుమార్, ఆల్‌ఇండియా కిషన్‌జనతాపార్టీ గట్టు చైతన్య, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ వీర నారాయణస్వామి నామినేషన్లను తిరస్కరించామన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం వాటిని తిరస్కరించినట్లు తెలిపారు.

13 నామినేషన్లు ఓకే..

కదిరి: కదిరి అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగింది. మొత్తం 28 నామినేషన్ల దాఖలు అయ్యాయి. వాటిలో 10 నామినేషన్లను రెండు సెట్‌లు ఉన్నవి తొలగించారు. మిగిలిన 18 నామినేషన్ల పరిశీలన చేశారు. వాటిలో 5 నామినేషన్లు తిరస్కరించారు. మిగిలిన వాటిలో 13 సరియైనవిగా అధికారులు ధ్రువీకరించారు. టీడీపీ కూటమి తరఫున కందికుంట వెంకటప్రసాద్, వైసీపీ తరఫున మగ్బుల్ అహమ్మద్, కాంగ్రెస్ తరఫున షాన్‌వాజ్, బీఎస్పీ తరఫున రామచంద్ర నామినేషన్లు సరిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మిగిలినవి, రిజిస్టర్డ్ పార్టీల వారికి, ఇండిపెండింట్‌లవి ఉన్నట్లు చెప్పారు.

మైనార్టీలను విస్మరించిన వైసీపీ

కదిరి అర్బన్, ఏప్రిల్ 26: వైసీపీ ప్రభుత్వం మైనార్టీలను విస్మరించిందని పట్టణ ముస్లిం మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మగ్బూల్ అహ్మద్ మైనార్టీలపై కపట ప్రేమచూపుతున్నారన్నారు. వైసీపీ పాలనలో మైనార్టీలపై దాడులు, అత్యాచారాలు జరిగాయన్నారు. టీడీపీతోనే ముస్లింల సంక్షేమం సాధ్యమన్నారు. మైనార్టీ నాయకులు కెఎస్ బాపుద్దీన్, డైమండ్ ఇర్ఫాన్, పర్వీన్‌బాను, మహ్మద్ అలీ, మైలానా అక్రం, అల్ఫా ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 26: మండలంలోని పోతుకుంట గ్రామానికి చెందిన రమణ (38) అనే వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రమణ ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. కాగా శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ధర్మవరం చెరువు కట్ట వద్ద వీర తిమ్మమ్మ ఆలయం సమీపంలోకి వెళ్లి పురుగులమందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గమనించి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కుటుంబసభ్యులు మెరుగైన చికిత్సకోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రమణ ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

ఘనంగా సీతారాముల ఊరేగింపు

పెనుకొండ, ఏప్రిల్ 26 : శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఏర్పాటుచేసిన సీతారాముల విగ్రహాలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగించారు. సీతారాముల ఉత్సవ ఉత్సవ విగ్రహాలను శుక్రవారం ట్రాక్టర్‌పై ఉంచి మేళతాళాలతో పట్టణంలో ఊరేగించారు. అనంతరం ఆలయంలో తీర్థ ప్రసాదాలు అందజేవారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు వెంకటేశులు, ప్రసాద్, సూర్యనారాయణ, అంబరీష్, బద్రీష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి అగళిలో టీడీపీ ప్రచారం

అగళి, ఏప్రిల్ 26: మండలంలో ఆదివారం నుంచి టీడీపీ కూటమి అభ్యర్థి ఎమ్మెఎస్ రాజు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జడ్పీటీసీ ఉమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు తాలూకా ఇంచార్జ్ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారన్నారు. ఉదయం 9.30కు పి బ్యాడిగెర, హెచ్‌డిహళ్లి, 11.30కు ఇరిగేపల్లి, 1గంటలకు ఆర్‌జిపల్లి 2.30కు కోడిపల్లి, 4.30గంటలకు రామనపల్లి, 6గంటలకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కత్తితో దాడి.. ఒకరి మృతి

ముగ్గురికి తీవ్రగాయాలు


గోపాల్‌నాయక్ మృతదేహం

పావగడ, ఏప్రిల్ 26: తాలూకా పరిధిలోని భూపూరుతాండాలో గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందాడు. తిరుమణి సీఐ గిరీష్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. భూపూరుతండాకు చెందిన నాగరీనాయక్ అనే వ్యక్తి గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో పావగడ నుంచి తన స్వగ్రామానికి కారులో వచ్చాడు. మద్యం మత్తులో ఉన్నాడు. దీంతో దారి పక్కన నిలిపిఉన్న అతడి మేనల్లుడు గోపాల్ నాయక్ (32) ద్విచక్రవాహనాన్ని కారుతో ఢీకొట్టాడు. దీంతో నాగరీనాయక్‌కు గోపాల్‌నాయక్, అతడి స్నేహితులు నాగరాజునాయక్, తరుణ్‌నాయక్, హేమంత్ నాయక్ అనే యువకులకు మధ్య గొడవ జరిగింది. వారు కొట్టుకున్నారు. అనంతరం ఇంటికి వెళ్లిన నాగరీ నాయక్ కత్తితీసుకొని వచ్చి అదే దారిన వెలుతున్న గోపాల్ నాయక్, అతడి స్నేహితులపై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. గోపాల్‌నాయక్‌పై నాలుగుసార్లు కత్తితో దాడి చేశాడు. అడ్డుకోబోయిన గోపాల్‌నాయక్ స్నేహితులపైనా దాడికి యత్నించగా వారు గాయాలతో తప్పించుకున్నారు. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రంగప్రవేశం చేసి గాయపడిన గోపాల్‌నాయక్, అతడి స్నేహితులను వెంటనే పావగడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే గోపాల్‌నాయక్ మృతి చెందినట్లు వైద్యులు తెలుపడంతో తీవ్ర ఆగ్రహం చెందిన స్నేహితులు నాగరీ నాయక్‌ను తమకు అప్పగించాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అయితే పోలీసులు సర్దిచెప్పారు. అనంతరం గాయపడిన స్నేహితులను, నిందితుడు నాగరీనాయక్‌ను తుమకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ గిరీష్ తెలిపారు. మృతుడి అంత్యక్రియలకు ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ హాజరయ్యారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఏప్రిల్ 26: పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఉంటున్న అయేషాబాను అనే మహిళ కుటుంబ కలహాలతో శుక్రవారం విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎస్సీ కాలనీ సమీపంలో అయేషాబాను, చాంద్‌బాష దంపతులు నివసిస్తున్నారు. దంపతుల మధ్య మనస్తాపాల కారణంగా ఆమె విషద్రావకం తాగింది. గమనించిన ఆమెను గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్య కోసం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడికి గాయాలు

గోరంట్ల, ఏప్రిల్ 26: మండలంలోని గంగంపల్లి తండాకు చెందిన వృద్ధుడు హనుమంతనాయక్ శుక్రవారం విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడు చార్జింగ్ లైట్‌కు కనెక్షన్ ఇచ్చే క్రమంలో నివాసంలోనే విద్యుదాఘాతానికి గురైనట్లు బంధువులు తెలిపారు. ప్రమాదంలో ఎడమచేయి, కాలు శరీరం కాలిపోవటంతో గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స జరిపించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మడకశిర రూరల్, ఏప్రిల్ 26 : మండలంలోని గొల్లపల్లి క్రాస్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దర్శన్ (19) అక్కడిక్కడే మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రం బీరనహళ్లికి చెందిన దర్శన్ పావగడ దగ్గర బంధువుల ఇంటిలో జరిగే శుభ కార్యక్రమానికి ద్విచక్రవాహనంలో వెళ్తున్నాడు. గొల్లపల్లి క్రాస్ వద్ద బైక్ అదుపు తప్పి బండరాయికి ఢీ కొంది. అతడు అక్కడిక్కడే మృతి చెందినట్లు బంధువులు, పోలీసులు తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసినట్లు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మడకశిర రూరల్, ఏప్రిల్ 26: మండలంలోని హరేసముద్రం గ్రామ సమీపంలోని పెద్ద చెరువులో శుక్రవారం సాయంత్రం రంగప్ప (45)అనే వ్యక్తిపడి మృతిచెందారు. మండలకేంద్రమైన లేపాక్షికి చెందిన రంగప్ప మైలార లింగేశ్వరస్వామి ఉత్సవాల చందాల కోసం మూడు రోజుల కిందట హరేసముద్రం వచ్చాడు. గ్రామంలో చందాలు సేకరించారు. శుక్రవారం తిరిగి గ్రామానికి వెళ్లే సమయంలో చేపలు పట్టుకోవడం కోసం చెరువులో దిగినట్లు గ్రామస్థులు తెలిపారు. అప్పటికై మద్యం మత్తులో ఉన్న అతడు చెరువులోఉన్న నీటి బురదలో ఇరుక్కుపోవడంతో పైకి రాలేక పోయాడు. అక్కడే పడి మృతిచెందినట్లు తెలిపారు. చెరువు కట్టపై ఉంచిన అతడి సెల్ ఫోన్ సాయంతో లేపాక్షిలోని వారి బంధువులకు సమాచార అందించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న అతడి కుమారుడు రాత్రి 8 గంటలకు వచ్చి తండ్రి మృతదేహన్ని స్వగ్రామానికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

గొడవలకు దూరంగా ఉండండి : ఏఎస్ఐ

మడకశిర రూరల్, ఏప్రిల్ 26 : ఎన్నిల సమయంలో గ్రామీణ ప్రజలు గొడవలకు దిగకుండా దూరంగా ఉండాలని ఏఎస్ఐ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైనా చందకచర్ల, అర్ అనంతపురం. గౌడనహళ్ళి, కల్లుమర్రి గ్రామాల్లో పోలీసులు శుక్రవారం ప్రజలకు అవగహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలు ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ఎలాంటి సమయంలో కేసులు నమోదుకాకుండా చూసుకోవాలాన్నరు. కార్యక్రమంలో పోలీసులు,ప్రజలు పాల్గొన్నారు.

నన్ను గెలిపిస్తే కేంద్రం నిధులు తీసుకొస్తా

ప్రచారంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే


రాప్తాడు నియోజకవర్గం కక్కలపల్లిలో మాట్లాడుతున్న బీకే పార్థసారథి


ప్రచారంలో పాల్గొన్న బీకే


సోమందేపల్లి మండలంలో బీకేకి హారతి పడుతున్న మహిళలు

హిందూపురం, ఏప్రిల్ 26 : టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించి తనను ఢిల్లీకి పంపితే కేంద్రం నిధులు విరివిగా తీసుకొస్తానని టీడీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారధి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన రాప్తాడు, పెనుకొండ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అయిన తనకు ప్రజల అండ కావాలన్నారు. తన హయాంలో ఉమ్మడి జిల్లాకు కియ పరిశ్రమ వచ్చిందని పెనుకొండ నియోజకవర్గానికి పలు కేంద్ర సంస్థలన తీసుకొచ్చానన్నారు. గతంలో కూడా ఎంపీగా పనిచేశానని ఆ అనుభవంతో మరిన్ని నిధులు తీసుకొస్తానన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా ఈసారి రాష్ట్రంలో, దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. దీనివల్ల అభివృద్ధి నిధులకు డోకా ఉండదన్నారు. కేంద్రం నుంచి వచ్చే యేయే పథకాలున్నాయో అన్నింటినీ నియోజకవర్గానికి తీసుకొచ్చేందుకు తన శాయశక్తులా కృషిచేస్తానన్నారు. ఐదేళ్ల వైసీపీపాలనతో రాష్ట్ర ప్రజలంతా విసిగి వేసారిపోయారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడా లేదని, దౌర్జన్యం, దందాలతో పాలన సాగుతోందన్నారు. అనుభవం ఉన్న చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే ఎంతో మేలు జరుగుతుందన్నారు. టీడీపీ అధి కారంలోకి రాగానే ప్రవేశపెట్టే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ పథకాలవల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. మహిళలకు, బడుగు బలహీన వర్గాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన ప్రచారంలో టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత, పెనుకొండ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి సవితమ్మ పాల్గొన్నారు.

బాలయ్య సమక్షంలో టీడీలోకి వలంటీర్


బాలయ్య సమక్షంలో టీడీపీలో చేరిన వలంటీరు సుకన్య

హిందూపురం, ఏప్రిల్ 26 : నియోజకవర్గం అభివృద్ధి బాలకృష్ణతోనే సాధ్యమని నమ్మి టీడీపీ చేరినట్లు చిన్నగుడ్డంపల్లికి చెందిన గ్రామ వలంటీరు సుకన్య తెలిపారు. ఆమె శుక్రవారం బాలకృష్ణ సమక్షంలో టీ డీపీలో చేరు. ఈ సందర్భంగా సుకన్య మాట్లాడుతూ అందరి భవిష్యత్తు బాగుపడాలంటే టీడీపీ రావాలని, హిందూపురం బాగుపడాలంటే బాల కృష్ణతోనే సాధ్యమని అందుచేతనే తాను వలంటీరుగా ఉన్నా టీడీపీలో చేరానన్నారు. భవిష్యత్తులో హిందూపురం నియోజకవర్గం బాలయ్యవల్ల ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ రామాంజినేయులు, మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాలయ్యకు ప్రజలు బ్రహ్మరథం : సవిత

పెనుకొండ రూరల్: స్టార్ కాంపెయిన్ అయిన బాలయ్యబాబుకు ఎక్కడ చూసినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని టీడీపీ కూటమి అభ్యర్థి సవిత పేర్కొన్నారు. హిందూపురం సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు కియ పరిశ్రమ హెలిప్యాడ్‌వద్ద ఘన సవిత స్వాగతం పలికారు. హిందూపురంలో బాలకృష్ణ ప్రచార కార్యక్రమం ముగించుకుని కారులో కియ పరిశ్రమ ఎదుట ఉన్న హెలిప్యాడ్ వద్ద కు శుక్రవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా సవిత బాలకృష్ణకు పుష్పగుచ్చం అందించి శాలువాకప్పి సన్మానించారు. బాలకృష్ణ నియోజకవర్గ పరిస్థితులపై సవితతో చర్చించారు. అనంతరం కియ హెలిప్యాడ్ నుంచి బాలకృష్ణ నెల్లూరు జిల్లా కావలికి బయలుదేరి వెల్లారు. బాలకృష్ణను చూడటానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు పోతిరెడ్డి, నాయకులు గుట్టూరు సూరి, వాసుదేవరెడ్డి, కొండారెడ్డి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


కియ హెలిప్యాడ్ వద్ద బాలకృష్ణకు సవిత ఘనస్వాగతం

పెనుకొండను ఆదర్శంగా తీర్చిదిద్దుతా: సవిత


ఎమ్మెల్యే అభ్యర్థి సవితకు హారతులిస్తున్న మహిళలు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 26: రాష్ట్రంలోనే పెనుకొండ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె శుక్రవారం సోమందేపల్లి మండలంలోని పోలేపల్లి, నడింపల్లి, పూలేపల్లి, పెద్ద బాబయ్యపల్లి, చాలకూరు, గుడ్డంపల్లి తదితర గ్రామాల్లో పెద్దఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. దారిపొడవునా మహిళలు హారతులలిచ్చి ఆశీర్వదించారు. అలాగే సూపర్‌సిక్స్ పథ కాలు, వాటి లబ్ధిగురించి సవిత వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చంద్రబాబు హయాంలో ఏర్పాటు చేసిన పరిశ్రమలే తప్ప నియోజక వర్గంలో వైసీపీ పాలనలో నెలకొల్పినవేవీ లేవన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వేల మందికి ఉద్యోగ, ఉపాధి కల్పనతోపాటు ఆరునెలల్లో అర్హులను గుర్తించి ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మే 13న జరుగనున్న ఎన్నికల్లో టీడీపీ విజయ పతాకాన్ని ఎగురవేయడం ఖాయమన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో వైసీపీకి ఓటేస్తే ప్రజలు ఉరి వేసుకున్నట్లేనన్నారు. చంద్రబాబు బీసీలకు ప్రత్యేక ప్రాధాన్య మిచ్చారని, టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి బీసీకి రూ.4వేలు పింఛన్, చదువుకునే ప్రతి విద్యార్థికి తల్లికివందనం కింద రూ.15వేలు అమలవుతుందన్నారు. ఎన్ని సంక్షేమ పథకాలు పెట్టినా అమలు చేసే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. జగన్మోహన్‌రెడ్డికి ఇలాంటి సత్తాలేదన్నారు. అలా సత్తా ఉంటే రూ.10లక్షల కోట్లు అప్పుచేసి ఉండేవాడుకాదన్నారు. జగన్ అసమర్థపాలనతో రాష్ట్రం వెనుకబడి పోయిందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనుడు ఈ సైకో సీఎం అన్నారు. రాజాధాని అమరావతి ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవమన్నారు. దాన్ని సీఎం జగన్ మూడు ముక్కలాటతో చెరిపేశార న్నారు. ఏది ఏమైనా చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం, రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీరుగంటి చంద్ర, కొత్త పల్లి శ్రీధర్, భానుకీర్తి, డీవీ ఆంజనేయులు, కిష్ట, జనసేన నాయకులు పాల్గొన్నారు.


సోమందేపల్లి మండలంలో పసుపుమయమైన ఎన్నికల ప్రచారం

అభివృద్ధి కావాలంటే బాబు రావాలి: గుండుమల


గౌడనహళ్లిలో మాట్లడుతున్న గుండుమల, ఎంఎస్ రాజు

మడకశిర రూరల్, ఏప్రిల్ 26: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కాలాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుు గుండుమల తిప్పే స్వామి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని చందకచర్ల, గౌడనహళ్ళి, ఆర్ అనంతపురం, చత్రం, బుళ్ళసముద్రం, కల్లుమర్రి, సీ కోడిగేపల్లి, మణూరు పంచాయతీ కేంద్రాల్లో ఎన్నిల ప్రచారం నిర్వహించారు. మొదట నియోజకవర్గానికి ఈశాన్యంలో ఉన్న చందకచర్ల ఆంజనేయస్వామి ఆలయంలో గుండుమల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజుతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అదే గ్రామం నుంచి ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గుండుమల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఓటువేసి, టీడీపీ మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజును, ఎంపీ అభ్యర్థి పార్థసారథిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతర టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి ఓటర్లుకు వివరించారు. ఎంఎస్ రాజు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త తెలుగుదేశం పార్టీగెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీలలో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీకి పెన్షనర్ల అసోసియేషన్ మద్దతు

మడకశిరటౌన్, ఏప్రిల్ 26: తెలుగుదేశం పార్టీకి రాష్ట్ర స్థాయిలో పెన్షనర్ల అసోసియేషన్ మద్దతు తెలుపుతుందని, మడకశిర నియోజకవర్గంలో సైతం మద్దతు తెలపాలని ఆ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు సూర్యనారాయణ, కోశాధికారి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మడకశిరలో పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు మల్లికార్జునను కలిశారు. తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు మడకశిర నియోజకవర్గంలో సైతం ఎన్‌డీఏ ఉమ్మడి అభ్యర్థి ఎం.ఎస్.రాజుకు మద్దతు ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే అభ్యర్థి రాజుతో కలిసి చర్చించి మడకశిర అసోసియేషన్ తరపున తాము మద్దతు తెలుపుతామని తెలిపారు. అభ్యర్థిని ఇంతవరకు కలవలేదని, కలిసి మడకశిర నియోజకవర్గం తరపున మద్దతు తెలుపుతామన్నారు. రాష్ట్ర స్థాయిలో పెన్షనర్ల అసోసియేషన్ తరపున బేషరతుగా టీడీపీ కూటమికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు జిల్లా నాయకులు తెలిపారు. మడకశిర నియోజకవర్గంలో సైతం మద్దతు ఇవ్వాలంటే, త్వరలో అభ్యర్థితో సమావేశమై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లా పెన్షనర్ల జాయింట్ సెక్రెటరీ జయరాం, నాయకులు సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ప్రచారంపై బాలయ్యతో ఇక్బాల్ సమీక్ష

హిందూపురం, ఏప్రిల్ 26 : ఎన్నికల ప్రచారంలో భాగంగా హిందూపురానికి వచ్చిన మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ శుక్రవారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో మైనార్టీలున్న ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహణపై చర్చించారు. ప్రజా వ్యతిరేకత ముఖ్యంగా మైనార్టీ అయిన తనను అధికార పార్టీ అవమానించిన తీరుపై చర్చించారు. ప్రచారంలో ప్రజలకు ఇచ్చే సూచనలు తెలిపారు. బాలకృష్ణ మాట్లాడు తూ మైనార్టీలున్న ప్రాంతంలో విస్తృతంగా పర్యటించాలని... ప్రభుత్వం మైనార్టీలకు చేసిన ద్రోహం, పథకాల రద్దుపై వివరించాలని సూచించారు.

మైనార్టీలను మోసం చేసిన జగన్ : ఇక్బాల్

గత టీడీపీ హయాంలో అమలు చేసిన మైనార్టీల పథకాలను వైసీపీ పాలనలో రద్దుచేసి తీవ్ర అన్యాయం చేశారని మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ అన్నారు. ఆయన శుక్రవారం పురంలోని 12, 13, 4వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇక్బాల్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే మైనార్టీలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో మైనార్టీలకు మేలే జరుగుతుందన్నారు. కానీ వైసీపీ లేనిపోని ఆరోపణలు చేస్తోందని మైనార్టీలు వాటిని నమ్మకూడదన్నారు. ఐదేళ్లకాలంలో బీజేపీపై ఒక్కమాటైనా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారా అన్నారు. ప్రతి బిల్లుకు జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ ఎంపీలు మద్దతు తెలిపారని, అయితే తెలుగుదేశం పార్టీ, బీజేపీ కలిస్తే మైనార్టీలకు ఏమో జరుగుతుందని ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. ఆయన కలిస్తే ఒకటి, టీడీపీ కలిస్తే మరొకటి ఎలా అవుతుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంతో మైనార్టీలకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ అనీల్‌కుమార్, పట్టణాధ్యక్షుడు రమేష్, అమర్నాథ్, షఫీ, హిదయతుల్లా, డైమండ్‌బాబా తదితరులు ఉన్నారు.

'వేమయ్య నాయకత్వంలో పనిచేయలేం'

పెనుకొండ, ఏప్రిల్ 26: సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఉన్న వేమయ్య నాయకత్వంలో తాము పనిచేయలేమని, రాష్ట్ర అధిష్టానం నాయకత్వాన్ని మార్చాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఐక్యాప ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, మండల కార్యదర్శి సుధాకర్, సాయినగర్ చాంద్‌బాష, అల్లా బకాష్, నరసింహ మూర్తి, నరసింహులు, తదితరులు మాట్లాడారు. జిల్లా కార్యదర్శి వేమయ్య అనుసరిస్తున్న పార్టీ వ్యతిరేక విధానాలు, ప్రజావ్యతిరేక విధానాలవల్ల పార్టీకి చెడ్డపేరు వస్తోందన్నారు. దీంతో పలువురు పార్టీని వీడుతున్నారన్నారు.

ప్రశాంతంగా తొలివిడత ఎన్నికలు


ఓటు వేసినట్లు చూపుతున్న డాక్టర్ జే వెంకటరామయ్య కుటుంబ సభ్యులు


ఓటు వేసి వస్తున్న పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, ఏప్రిల్ 26: రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం జరిగిన తొలివిడత పార్లమెంటు ఎన్నికలు పావగడలో ప్రశాంతంగా జరిగాయి. తాలూకా వ్యాప్తంగా 246 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహణకు తహసీల్దార్ సంతోష్‌కుమార్ ఏర్పాట్లు పూర్తి చేశారు. తాలూకాలో 1,97,458 ఓటర్లు ఉండగా 1,46,456 ఓట్లు పోలయ్యి 74 శాతం పోలింగ్ జరిగినట్లు తహసీల్దార్ తెలి యజేశారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా సహకరించినందుకు తాలూకా లోని ఓటర్లకు తహసీల్దార్ కృతజ్ఞతలు తెలియజేశారు. హనుమంతనహళ్లిలో ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప, కేటీ హళ్లిలో మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, పావగడలో బీజేపీ సీనియర్ నేత ప్రముఖ వైద్యులు డాక్టర్ జే వెంకటరామయ్య, డాక్టర్ శశికిరణ్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

'పురం'లో 16 నామినేషన్ల తిరస్కరణ

హిందూపురం, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి దాఖలైన 34నామినేషన్లలో 16తిరస్కరణకు గురైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం రిటర్నింగ్ అధికారి అభిషేక్‌కుమార్ నేతృత్వంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సాగింది. ఈ సందర్భంగా 21మంది అభ్యర్థులు అందజేసిన 34నామినేషన్లలో 16తిరస్కరణకు గురయ్యాయి. 19నామినేషన్ పత్రాలు చెల్లుబాటయ్యాయని ఆర్ఓ తెలిపారు. తిరస్కరణకు గురైన వారిలో స్వతంత్ర అభ్యర్థులున్నారు. వీరిలో వెంకటేశ్‌రెడ్డి, పార్వతి, అనీల్‌కుమార్, సురేష్ నామినేషన్‌పత్రంలో ప్రత్యక్షంగా చేసిన సంతకాలు, పత్రంలో సంతకాల్లో వ్యత్యాసం ఉండటంతో తిరస్కరించినట్లు ఆర్ఓ తెలిపారు. నందమూరి బాలకృష్ణ బీ-ఫారం సమర్పించడంతో ఆయన సతీమణి నందమూరి వసుంధరదేవి నామినేషన్ తిరస్కరించారు. అదేవిధంగ ఆవైసీపీ అభ్యర్థి దీపిక భర్త వేణురెడ్డి నామినేషన్ పత్రాలు కూడా తిరస్కరించారు.

పెనుకొండలో మూడు...

పెనుకొండ: స్థానిక అసెంబ్లీ నియోజకవర్గానికి మొత్తం దాఖలైన 25నామినేషన్లలో మూడు తిరస్కరణకు గురయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అ పూర్వభరత్ తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రిటర్నింగ్ అధికారి అపూర్వభరత్ అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ పత్రాలను పరిశీలించారు. దాఖలైన నామినేషన్లలో టీడీపీ మద్దతుదారుడిగా రవికుమార్ దాఖలు చేసిన రెండు నామినేషన్లు, స్వతంత్ర అభ్యర్థిగా దాఖలు చేసిన రెండు నామినేషన్‌లలో ఒకదానిని వివిధ కారణాలవల్ల తిరస్కరించినట్లు ఆర్వో తెలిపారు. పరిశీలన కార్యక్రమానికి టీడీపీ అభ్యర్థి సవిత, వైసీపీ అభ్యర్థి ఉషశ్రీ చరణ్, కాంగ్రెస్ అభ్యర్థి నరసింహప్ప, బీఎస్పీ అభ్యర్థి ఆదినారాయణ, జైభీమ్ పార్టీ అభ్యర్థి నాగరాజురావు, స్వతంత్ర అభ్యర్థులు గణేష్ నాయక్, హబీబుల్లా, నరసింహులు, నరేంద్ర తదితరులు హాజరయ్యారు.

మడకశిరలో ఏడు...

మడకశిరటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మడకశిర నియోజకవర్గంలో దాఖలైన 22 మంది నామినేషన్లలో ఏడు తిరస్కరించినట్లు ఆర్ఓ గౌరీశంకర్ తెలిపారు. స్థానికతహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆర్ఓ నామినేషన్‌ల పరిశీలన చేపట్టారు. ఆరుగురి నామినేషన్ పత్రాలను తిరస్కరించామన్నారు. అందులో తిప్పేస్వామి, ఎంఈ సునీల్‌కుమార్, ఎన్ మంజునాథ్, ఏ కృష్ణ, ఎస్ సునీల్‌కుమార్, ఎన్ నరసింహమూర్తిలకు చెందిన నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు. టీడీపీకి చెందిన రెండు, వైసీపీ తరఫున ఒకటి, సమాజ్‌వాదీపార్టీ ఒకటి, ఇండిపెండెంట్ల మూడు నామినేషన్‌లు తిరస్కరించినట్లు తెలిపారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్ పత్రాలు సజావుగా ఉండటంతో డమ్మీ అభ్యర్థుల నామినేషన్‌లను తిరస్కరించినట్లు తెలిపారు. 15 నామినేషన్‌లు సజావుగా ఉన్నట్లు తెలిపారు.

మడకశిరలో ఎన్నికల అబ్జర్వర్ పర్యటన

మడకశిర నియోజకవర్గంలో జరుగుతున్న ఎన్నికల నియమావళి అమలుతీరును ఎన్నికల అబ్జర్వర్ అన్నుకుమార్ శుక్రవారం పర్యటించి పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్‌ని పరిశీలించి అనంతరం స్థానిక అధికారులతో ఎన్నికల నియమావళిపై తీసుకొంటున్న చర్యలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఈవీఎం మిషన్లు భద్రపర్చిన గదులు తదితర వాటిని పరిశీలించారు

టీడీపీ ఇంటింటి ప్రచారం

రొద్దం, ఏప్రిల్ 26: టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పేరుతో ఏడాదికి రూ.15 వేలు అందిస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. వారు శుక్రవారం రొద్దం మండల పరిధిలోని రెడ్డిపల్లి, గోనిమేకలపల్లి, పెద్దగువ్వ లపల్లి, చిన్నగువ్వలపల్లి, ఆర్ కొట్టాల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, సుబ్బరత్నమ్మ, చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి, ఇమాంసాబ్, హరీష్, అశ్వర్థనారాయణ, నరహరి, నరసింహులు, టైలర్ అంజనేయులు, పుల్లప్పచౌదరి, శ్రీనాథ్‌చౌదరి పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక

రొద్దం, ఏప్రిల్ 26 : మండల పరిధిలోని గోనిమేకలపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. శుక్రవారం రొద్దం మండల పరిధిలోని గోనిమేకలపల్లిలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించగా వైసీపీ కార్యకర్తలైన పూజారి మారెప్ప, పూజారి నరసింహులు, పూజారి సునీత, శివ, ఆదెమ్మ, ఆదెమ్మ పార్టీలో చేరారు. అదేవిధంగా గోనిమేకలపల్లికి చెందిన వలంటీరు తండ్రి నాగరాజు, కిష్టప్ప, డీలర్ తమ్ముడు నాగరాజు, సర్పంచ్ చిన్నాన్న కుమారుడు రవి, గురుమూర్తి, తదితరులు టీడీపీ అభ్యర్థి సవిత సమక్షంలో కండువాలు వేయించుకున్నారు.

అక్రమ లేఅవుట్‌లకు బాధ్యులు కార్యదర్శులే..: ఈఓఆర్డీ

గోరంట్ల, ఏప్రిల్ 26: మండల వ్యాప్తంగా ఉన్న లేఅవుట్లు అన్నీ అక్రమమే అని, రాజకీయ ప్రోద్బలంతో ఇలా జరిగినందున ఇందుకు పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాలని ఈఓఆర్డీ సుధాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎన్ని కల కోడ్ కారణంగా విధాన పరమైన నిర్ణయాలు, ఆమోదాలు లేకుండానే అత్యవసర విషయాలపై చర్చించారు. మారెమ్మ గుడి వద్ద అక్రమ లేఅవుట్ గురించి కొండాపురం ఎంపీటీసీ సునందమ్మ ఫిర్యాదు చేయగా ఈఓఆర్డీ పై విధంగా స్పందించారు. అక్రమ లేఅవుట్లపై కార్య దర్శులు వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్స్‌కవేటర్‌తో రహదారులను, లేఅవుట్‌లోని నిర్మాణాలను తొలగించి తదుపరి చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. పాలనా పరమైన ఆమోదం లేని పనులకు బి ల్లుల చెల్లింపులు జరుగ వన్నారు. కరువు ప్రాంతమై నందున ఉపాధి పనులు విరివిగా కల్పించాలన్నారు. దీనికి ఎన్ని కల కోడ్ వర్తించదన్నారు. పులేరు, వెంకట రమణపల్లి, బూదిలి, గడ్డం తండాలలో పనులు మం దకొడిగా సాగుతున్నా యని, ఎక్కువ మంది కూలీలలతో పనులు చేపట్టాలని ఆదేశించారు.